₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

ఆగస్టు 16-31 2018




## అవినీతి నిరోధక చట్టానికి చరిత్రాత్మక 'చెత్త' సవరణలు

## బస్తీ దవాఖానాలు : ప్రజారోగ్య సామర్థ్యాన్ని పెంచుతాయా?



## వాదించటమే కాకుండా ఒప్పించటమూ నేర్చుకోవాలి

సోషల్ మీడియాలో వాదనల్లో నెగ్గటమే కాకుండా ప్రత్యర్థి పక్షాన్ని ఒప్పించటం కూడా యువత అలవాటు చేసుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. విద్వేషం, తీవ్రవాదం, నిందారోపణల స్థానంలో... సానుకూల పోస్టులను, ప్రచారాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో 'వాయిస్ పాజిటివ్' పేరుతో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన సెమినార్ ముగింపు కార్యక్రమంలో జేపీ ప్రసంగించారు. ఓయూ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగం, ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

---

## బుద్ధుడి దమ్మపదం అనుసరణీయం



బుద్ధుడు చూపిన ధర్మమార్గం అనుసరణీయమని డా॥ జేపీ అన్నారు. హైదరాబాద్ మహేంద్రహిల్స్ మహాబోధి బుద్ధవిహార్‌లో ధర్మచక్ర పరివర్తన దినంగా భిక్షువులు నిర్వహించిన గురుపూర్ణిమ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దమ్మపదం సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాసకులు, రిటైర్డ్ ఐపీఎస్ ఆంజనేయరెడ్డి, నారాయణరెడ్డి, బుర్రా రామయ్య, చెన్నయ్య, ఆదిలక్ష్మయ్య, పెద్దసంఖ్యలో బౌద్ధ అభిమానులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...


# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

ఆగస్టు 16-31, 2018 సంపుటి - ౨ సంచిక - 16

## లోపలి పేజీల్లో...

అవినీతి నిరోధక చట్టానికి చరిత్రాత్మక.............5
బాధిత ప్రజలనే శిక్షిస్తూ లంగొండులను ............7
అవినీతి నిరోధక చట్టానికి ప్రతిపాదించిన......... 9
సామాన్య ప్రజలను జైలుకు పంపుతూ ...............12
'ప్రజలకు జైలు... అవినీతి అధికారులకు ముద్దు'.....13
నిజాయతీకి నివాళి ! ................................. 15
దొంగల జోడీ.... సంపద దోపిడీ...................... 17
పటిష్ట చట్టమే అవినీతికి పగ్గం........................ 19
అవినీతి భల్లూకం పట్టులో............................ 21
అవినీతి నిర్మూలనకు పాలకులు చేపట్టాల్సిన...... 23
బస్తీ దవాఖానాలు : ప్రజారోగ్య సామర్థ్యాన్ని........ 26
పర్యాటక పరిశ్రమకు నూతనోత్తేజం................ 29
(మీడియాలో) 'కీ' కామెంట్లు !....................... 31
సురాజ్య ఎజెండాను అమలు చేస్తే ఉపాధి, 33




## కార్టూన్ కార్నర్

### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |


♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# 'లాలూచీ' చట్టసవరణ



ఇటీవలి పార్లమెంటు సమావేశాలు రాజకీయాల దిశతో పాటు.. మన ప్రజాస్వామ్య దశకు కూడా అద్దం పట్టాయి. పార్లమెంటులో గత సమావేశాల వైఫల్యాల్ని మరిపించాలనో, ఇంకేదైనా కారణం చేతో.. ప్రధాన జాతీయ పార్టీలతోపాటు అవిశ్వాసానికి నోటీసిచ్చిన తెలుగుదేశం, కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా తమకున్న సరకును వీలైనంత ప్రదర్శించే ప్రయత్నం చేశాయి. కేవలం 16 మంది ఎంపీలున్న టీడీపీ.. కేంద్రంలో బలంగా ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం మీద అవిశ్వాసాన్ని తేవటం విశేషమే. ఆ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి జాతీయ స్థాయిలో ఉన్న సంబంధాలకు, ఆయనకున్న 'సోఫిస్టికేటెడ్' రాజకీయ చాతుర్యానికి ఇది నిదర్శనం. అవిశ్వాసాన్ని తొలుత ప్రతిపాదించిన జగన్ పార్టీ నుంచి దాన్ని లాక్కుని మరీ చంద్రబాబు రాజకీయ చర్చను తన వైపు తిప్పుకున్నారు. కానీ ఇదందా చర్చ ముందు! చర్చ తర్వాత పరిస్థితి నీరసంగా మారింది. ఏపీకి ప్రత్యేక తరగతి హోదాపై జాతీయ స్థాయిలో ఎవరినీ ఆ చర్చ ఆకర్షించలేదు. ఏపీ ఎంపీలు అనర్గళంగా మాట్లాడారనటంలో సందేహం లేదు. కానీ 'ఒక రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపటం యావత్ దేశం సమస్య' అనే భావనను పార్లమెంటులో, ఇతర రాష్ట్రాలవారిలో తేవటంలో ఆ ప్రసంగాలు విఫలమయ్యాయి. ఫెడరలిజం కోసం పోరాడుతున్నామని టీడీపీ చెప్పుకుంటున్నా, ఫెడరల్ వ్యవస్థ బలోపేతానికి ఆ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు 1980లలో గట్టి కృషి చేసినా.. అవిశ్వాసంపై చర్చలో దాన్ని బలమైన అస్త్రంగా పార్టీ మలచలేకపోయింది. విభజన వల్ల హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే మిగిలిన ఏపీకి ప్రత్యేకహోదాను తొలుత ప్రతిపాదించింది లోక్‌సత్తా. ఆ హోదాను బాగా వెనుకబడిన రాయలసీమకి, ఉత్తరాంధ్రకు ఇవ్వాలని, ప్రత్యేకసాయాన్ని అందించాలని ఆ సమయంలో అసెంబ్లీలో నేను సూచించాను. రాయలసీమ గణాంకాలు.. కీలక విభాగాల్లో హోదా గల రాష్ట్రాల గణాంకాల కంటే తక్కువగా ఉన్నాయని, పైగా మహారాష్ట్ర నుంచి కన్యాకుమారి వరకు ఏ రాష్ట్రానికీ హోదా లేదని, కాబట్టి మనం మొత్తం దక్షిణ ద్వీపకల్పంలోనే ఒక ప్రాంతానికి హేతుబద్ధ రీతిలో హోదా అడగటం సముచితం అనే వాదనతో నేను ఆ ప్రతిపాదన చేశాను. "మొత్తం ఏపీకి, తెలంగాణకు కూడా హోదా ఇస్తే తెలుగువాడిగా సంతోషిస్తాను. కానీ అది సాధ్యం కాదు. ఇలాంటి ప్రతిపాదనలకు జాతీయ దృష్టి, ఇతర రాష్ట్రాలను ఒప్పించటం ముఖ్యం" అని ఆరోజు స్పష్టం చేశాను. లోక్‌సత్తా చేసిన ప్రత్యేక హోదా, ఇతర ప్రతిపాదనల్ని కేంద్రంలోని కాంగ్రెస్, బీజేపీ స్వీకరించాయిగానీ.. ఏపీ మొత్తానికీ ప్రత్యేకహోదా అని మార్చేశాయి. అదే సమస్యగా మారింది. దానికి తోడు కాలహరణం కావటంతో సమస్య జటిలంగా మారింది. ఈ నేపథ్యాన్నంతా దృష్టిలో పెట్టుకుని అవిశ్వాసంపై చర్చలో ప్రసంగాన్ని, వ్యూహాల్ని రచించి ఉంటే మెరుగ్గా ఉండేది. ఫ్లోర్ మేనేజ్‌మెంట్ కూడా బలహీనంగా ఉంది. ఫెడరలిజం చుట్టూ ఇతర రాష్ట్రాలను కలుపుకునేలా వ్యవహరించలేకపోయారు. ఎవరి రాష్ట్రం వారికి గొప్ప కావచ్చు, కానీ జాతీయస్థాయి అంశాలకు సంబంధించి ఇతర రాష్ట్రాలను ఒప్పించాలన్న రాజకీయ విజ్ఞత కరవైతే.. కొన్ని పార్టీలకు ఓట్లు తప్ప, ప్రజలకు నిధులు రావు. ఏపీ సమస్యలకు ప్రధాని ఇచ్చిన సమాధానం ఇంకా బాధ్యతారహితంగా ఉంది. గత సమావేశాల్లో ఏపీ సభ్యులు ఆందోళన చేస్తున్నప్పుడైనా ప్రధాని జోక్యం చేసుకుని ఒక్క ఐదు నిముషాలు వివరణ ఇచ్చినట్టయితే, తెలుగు రాష్ట్రాల ప్రజలనుద్దేశించి నిర్దిష్టంగా నిర్ణీత కాలవ్యవధిలో సమస్యలు పరిష్కరించేలా హామీ ఇచ్చినట్టయితే.. ఇంత దాకా వచ్చేది కాదు. ఇలాంటి వాతావరణంలో కూడా.. నీతి ఆయోగ్, ఆర్థిక సంఘం ఒప్పుకోలేదంటూ అసంబద్ధమైన సమాధానాలను ప్రధాని ఇవ్వటం ఆయన స్థాయికి తగదు. దేశంలో అంతర్భాగమైన ఒక రాష్ట్ర ప్రజల పట్ల అంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో దేశ సమగ్రతకు ముప్పు వచ్చే ప్రమాదం మీద కనీస చింతయినా ప్రధానికి ఉండాలిగా! మిగిలిన విషయాల్లో కీలకమైన ఉపాధి, వ్యవసాయంపై కూడా పేలవమైన గణాంకాలు, తర్కంతో దాటవేశారు. మోదీపై ప్రచార ఆధిక్యాన్ని సాధిస్తే చాలు.. ఏ పరిష్కారం చూపకపోయినా ప్రజలకు తమకే ఓటేస్తారు, జాతీయ పార్టీగా బీజేపీకి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ తప్ప గతి లేదు అన్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వ్యవహరించారు. 'గ్రీన్‌ఫీల్డ్ పరిశ్రమలు', క్వాంటిపై చేసి నిధుల రూపంలో చెల్లింపు వంటి పరిష్కారాలతో పొరుగు రాష్ట్రాలకు ఇబ్బంది లేకుండానే ఏపీకి ప్రత్యేకహోదా సాయాన్ని అందించవచ్చన్న ఆలోచన చేయకుండా.. ఏపీ, తెలంగాణల మధ్య నెలకొన్న సామరస్యాన్ని ప్రత్యేకహోదా పేరుతో మళ్లీ చెడగొట్టి, ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న వ్యూహం చూచాయగా ఆ పార్టీల్లో కనిపించింది. సోదరుడు పవన్ కళ్యాణ్ చొరవతో ఏర్పడిన జేఎఫ్‌సీ (జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ)కి కొనసాగింపుగా లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ ఏర్పాటు చేసిన 'స్వతంత్ర నిపుణుల బృందం' (ఐజీఈ) వీటన్నిటిపై కసరత్తులు చేస్తోంది. మచ్చలేని తెలుగేతర నిపుణుల పరిశీలన కూడా పూర్తయ్యాక వెలువడే ఈ నివేదిక ఏపీ హోదా సహా తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలకు ఆమోదయోగ్య పరిష్కారాల్ని అందిస్తుందని ఆశిద్దాం. ఇక తమ తక్షణ ఎన్నికల ప్రయోజనాలను పెద్దగా ప్రభావితం చేయలేవు అనుకున్న అంశాలపై పార్టీలన్నీ ప్రజలకు వ్యతిరేకంగా పార్లమెంటులో ఏకమయ్యాయి. ప్రజల సార్వభౌమాధికారాన్ని వికటాట్టహాసంతో పరిహసించే ఓ చట్ట సవరణను మూకుమ్మడిగా ఆమోదించాయి. అవినీతి నిరోధక చట్టానికి చేసిన ఈ సవరణ ద్వారా.. ప్రభుత్వం నుంచి హక్కుగా అందాల్సిన సేవలకు గత్యంతరం లేక వందో, వెయ్యో లంచం ఇచ్చే సామాన్యుడినీ వెంటనే అరెస్టు చేయొచ్చు, విధిగా మూడేళ్లపాటు, ఏడేళ్ల వరకూ జైల్లో పెట్టొచ్చు! మరోవైపు లంచం తీసుకున్న అధికారిని (ప్రజాప్రతినిధి తదితరుల్ని కూడా) పోలీసులు కనీసం ప్రశ్నించాలన్నా పైవారి అనుమతి తీసుకోవాలి. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినవారికి మాత్రమే ఇది వర్తించదు. మనదేశంలో ప్రభుత్వోద్యోగం చేసే ఓ బంట్రోతు.. 90 శాతం ప్రజలకన్నా శక్తిమంతుడు. సర్కారీ బంట్రోతుకున్న జీవన భద్రత లేక బిక్కుబిక్కుమంటూ తమ హక్కుల కోసం చేయిజాచి అర్థించేలా ప్రజల్ని తయారుచేసిన పాలకులు.. ఇప్పుడు లంచం ఇచ్చి కూడా ఫిర్యాదు చేసేందుకు భయపడేలా చేస్తున్నారు. చట్టాల్ని ఎప్పుడూ.. 'కాగితాల మీద తేలిగ్గా ఉండేలా, అమలులో కఠినంగా ఉండేలా, ప్రజల సాధికారతను పెంచేలా' ఎంతో లోతుగా ఆలోచించి ఒడుపుగా రూపొందించాలి. కానీ అవినీతి నిరోధక చట్ట సవరణ అందుకు పూర్తి విరుద్ధం (దీనిపై హేతుబద్ధ వాదనలతో, తొలి నుంచీ లోక్‌సత్తా పోరాడుతోంది). దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా అధికారులతో 'లాలూచీ' పడి లంచమిస్తే పౌరులైనా అదనపు శిక్షకు అర్హులు. అలాంటిది, ప్రజాప్రయోజనాలకు విఘాతం కలిగించేలా లాలూచీ పడి చట్టసవరణను ఆమోదించే పార్టీలకు ఇంకెంత కఠిన శిక్ష పడాలి?





# అవినీతి నిరోధక చట్టానికి చరిత్రాత్మక 'చెత్త' సవరణలు!

లంచం తీసుకునే ప్రభుత్వోద్యోగ వ్యవస్థను సరిగా పనిచేయించే సత్తా లేక.. లంచం బాధితులైన పౌరులను జైలుకు పంపే అప్రజాస్వామిక చట్టాన్ని ఈ దేశ పార్లమెంటు ఆమోదించింది. రాష్ట్రపతి స్టాంపింగ్ కూడా పూర్తవటంతో నూతన చట్టం అమల్లోకి వచ్చింది.

అవినీతి నిరోధక చట్ట (1988) సవరణ పేరుతో 2013లో ఈ బిల్లును తెచ్చినప్పుడే లోక్‌సత్తా గట్టిగా అభ్యంతరం చెప్పింది. పార్లమెంటరీ కమిటీ ముందు వాదించింది. అన్ని పార్టీల నాయకులకూ వివరించింది. ఎలాగో చివరకు ఆ చట్టం తేకుండా యూపీయే ప్రభుత్వం పక్కన పెట్టింది. 2014లో నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం మళ్లీ ఆ బిల్లును కదిలించింది. అప్పుడు కూడా లోక్‌సత్తా తన వంతు ప్రయత్నం చేసింది. బిల్లులోని లోపాలపై మంత్రులకు, అన్ని పార్టీల ఎంపీలకు, అధ్యక్షులకు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి జయప్రకాష్ నారాయణ్ లేఖ రాశారు. ఆ లేఖతో పాటు.. చట్ట సవరణ బిల్లులోని లసుగుల్ని సవివరంగా చెప్పే 8 పేజీల నోట్‌ను కూడా పంపారు. న్యాయశాఖా మంత్రిని స్వయంగా కలిసి వివరించారు. మళ్లీ కొన్నాళ్లు బిల్లును ఆపారు. చివరికి జులై, 2018లో పార్లమెంటు ఉభయసభలూ బిల్లును ఆమోదించాయి. ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజల మీద పెత్తనం చేయటానికి, వారిని నిరంతరం తమ కింద పడుండేవారుగా కొనసాగించటానికి, ఈ క్రమంలో ప్రభుత్వోద్యోగ వ్యవస్థతో తమకున్న లాలూచీ దెబ్బతినకుండా ఉండటానికి.. రాజకీయ పార్టీలన్నీ కుమ్మక్కయినట్టు ఈ బిల్లును ఆమోదించాయి. ఒక రిపబ్లిక్ రాజ్యాంగస్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా ఉందా చట్టసవరణ.

పేదరికం, అవిద్య విస్తృతంగా ఉన్న మన దేశంలో హక్కుగా కావాల్సిన పనికి ప్రజలు ఎందుకు లంచం ఇస్తున్నారో కూడా తెలియనంత అమాయకులేమీ కాదు మన ప్రజాప్రతినిధులు. ప్రభుత్వ కార్యాలయాల్లో మాకు పనులు చేసి పెట్టండి బాబూ అని తమ వద్దకు వచ్చి మొరపెట్టుకోకపోతే.. ఇక దోపిడీ రాజకీయంతో ఓట్లు దండుకోవటానికి తమ వద్ద అవకాశాలు, తాయిలాలు ఏమి ఉంటాయి? ప్రజలను తమ గుప్పెట్లో పెట్టుకోవటానికి పార్టీలన్నీ కలిసి పన్నిన పన్నాగమిది.

లంచం ఇవ్వకుండా మనదేశంలో చాలామందికి పని జరగదు. చట్టసవరణ తర్వాత ఇప్పుడు.. లంచం ఇవ్వకుండా ఉండాలన్నా, లంచం ఇచ్చి చట్టానికి దొరకకుండా ఉండాలన్నా– మళ్లీ మధ్యలో ఏ రాజకీయ నాయకుడినో ఆశ్రయించాలి. లంచం ఇచ్చి ఫిర్యాదు చేస్తే అధికారులు చుక్కలు చూపించే అవకాశాలు ఎక్కువ కాబట్టి.. ఈ సందర్భంలో కూడా ఎవరోక రాజకీయ ప్రతినిధి పట్టుకోవాల్సి రావచ్చు. 'ప్రజాస్వామ్యంలో ప్రభువుల మైన మాకు హక్కుగా జరగాల్సిన పనులకు లంచం తీసుకునే అధికారుల మీద విచారణకు అనుమతి కావాలనటమేంటి!, మమ్మల్ని జైల్లో పెట్టటమేంటి?' అని ప్రశ్నించే అవగాహన ప్రజల్లో లేదు కాబట్టి.. నాయకులు తమను అవమానిస్తున్నారన్న ఆగ్రహం వారిలో కలిగి తిరగబడే అవకాశాలు తక్కువ. పైకి అవినీతి మీద పోరాటం చేస్తున్నట్టుంటుంది, మరోపక్క ప్రజల మీద యథేచ్ఛగా తాము స్వారీ చేయొచ్చు. అందుకే.. లోక్‌సత్తా ఎంత పోరాడినా, ప్రజల్ని కించపరిచేలా ఆ నియంతృత్వ చట్టసవరణను పార్లమెంటులో ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఈ చట్టంతో ఒకవేళ అవినీతి తగ్గిందనుకున్నా.. లంచాలిచ్చే వాళ్లు ఇంకా కోట్ల సంఖ్యలోనే ఉంటారని ప్రతి నేతకూ తెలుసు. ఇంతమందిపై విచారణ చేయటానికి ఎన్ని సమస్యలు, జైళ్లు ఎలా పడతాయి, ఇదసలు ప్రజాస్వామ్యమేనా.. అన్న ఇంగితం కూడా లేకుండా ఆమోదించేశారు. అవినీతి ప్రస్తావనకు పౌరులు కూడా భయపడుతుంటారు కాబట్టి.. సమాజంలో దానిపై చర్చ కూడా లేకుండా చేసి అంతా బాగున్నట్టు భ్రమింప చేయగలమన్న నమ్మకమేమో! "పౌరుడు–అధికారి లాలూచీ పడ్డ, అధికారుల మీద కుట్రపూరిత ఆరోపణలు చేసిన పరిమిత సందర్భాలకు వర్తింప చేయాల్సిన

నిబంధనల్ని'' అసంబద్ధంగా అందరికీ, అన్ని సందర్భాలకీ వర్తింపచేస్తున్నారు.

వనిలోవనిగా తమకు ఇప్పటికే లోపాయికారీగా ఉన్న ముందస్తు రక్షణకు కొంత చట్టబద్ధతను ఈ చట్ట సవరణ ద్వారా రాజకీయ నేతలు కల్పించుకున్నారు.

మొత్తంగా చట్ట సవరణలో ఉన్న కొన్ని సానుకూల అంశాలను కూడా మరుగున పరిచేలా చట్టాన్ని సవరించారు.

అవినీతి నిరోధక చట్టానికి చేసిన తాజా సవరణల వివరాలు ప్రాథమికంగా:

'లంచం ఇచ్చినా జైలే! నేరపూరిత దుష్ప్రవర్తన కిందకు అక్రమార్జన, ఆస్తుల దుర్వినియోగం! అవినీతి ఉద్యోగుల ఆస్తుల జప్తు!'.. ఈ మేరకు రూపొందించిన అవినీతి నిరోధక సవరణ బిల్లు చరిత్రాత్మకమని ప్రభుత్వం అభివర్ణించింది. ''ఇన్నాళ్లూ లంచం పుచ్చుకుంటేనే నేరం. పుచ్చుకున్నవారు మూడేళ్ల నుంచి ఏడేళ్ల దాకా శిక్షార్హులు. దీనికి జరిమానా అదనం. కేసు తీవ్రతను బట్టి కోర్టు తీర్పు మేరకు శిక్షలు, రికవరీలు ఉంటాయి. ఇప్పుడు లంచం ఇవ్వజూపిన వారిని కూడా అదే గాటన కడుతున్నాం. వీరికీ అంతే శిక్ష'' అని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి తెలిపారు. ప్రభుత్వాధికారులెవరైనా లంచం తీసుకున్నట్టు ఆరోపణలు వస్తే వారిని విచారించడానికి ముందు ముందస్తు అనుమతి తప్పనిసరని వివరించారు. ఇప్పటిదాకా సంయుక్త కార్యదర్శి స్థాయికి ఎగువన ఉన్న అధికారికే ఇది వర్తించేదని, ఇప్పుడు అందరికీ వర్తింప చేస్తున్నామని తెలిపారు. ''నకిలీ ఫిర్యాదుల నుంచి ప్రభుత్వాధికారులను, నిజాయతీపరులైన అధికారులను కాపాడటం మా విధి. ఎవరినీ ముందస్తుగా అరెస్టు చేయకూడదు. ఈ కేసులను కోర్టులు రెండేళ్లలోపు పరిష్కరిస్తాయి'' అని చెప్పారు.

★ లంచం ఇవ్వజూపడమంటే ఒక పనిని (అక్రమాన్ని) ప్రోత్సహించినట్లే. ఇది క్రిమినల్ నేరం కిందకు వస్తుంది.

★ ఒత్తిడి వల్ల లంచం ఇచ్చిన పరిస్థితి ఉంటే- వెనువెంటనే ఆ విషయాన్ని అవినీతి నిరోధక విభాగానికి వారంలోగా తెలియజేయాలి.



లంచం ఇవ్వకపోయావో ఇస్తానన్నావని చెబితా జాగ్రత్త!



ఇచ్చినతను కూడా ఎక్కడా చెప్పడు! ఇంకా హ్యాపీ!!

★ 'నేరపూరిత దుష్ప్రవర్తన' నిర్వచనాన్ని మార్చారు. అక్రమార్జన, ఆస్తుల దుర్వినియోగం.. మొదలైనవాటిని దానికింద చేర్చారు.

★ తరచూ లంచం తీసుకునే వ్యక్తుల విషయంలో నిబంధనలను కఠినతరం చేస్తూ నిర్వచనాల్ని మార్చారు.

★ అవినీతి ఉద్యోగుల ఆస్తుల జప్తునకు బిల్లు వీలు కల్పిస్తోంది.

★ పదవిలో ఉన్న అధికారుల విచారణకు సంబంధిత శాఖలోని ఉన్నతాధికారులు, లేదా యజమానుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. ఈ రక్షణ పదవీ విరమణ చేసినవారికి కూడా వర్తింపు.

★ ఒక వాణిజ్య సంస్థ ఒక నిర్దిష్టమైన పనిచేయించుకోవడానికి లంచం ఇస్తే ఆ సంస్థను బుక్ చేస్తారు. ఆ సంస్థలోని ఉద్యోగుల చేత ఈ పని చేయించినా ఆ సంస్థే జవాబుదారీ.

★ ప్రభుత్వోద్యోగులెవరిపైనా పోలీసులు దర్యాప్తు చేయరాదు. ముఖ్యంగా ఆ నేరం ఆ అధికారి విధులకు సంబంధించినదై ఉంటే పోలీసులకు ఎలాంటి దర్యాప్తు అధికారమూ ఉండదు. ఒకవేళ ముందస్తుగా అనుమతి పొందితే దానిని సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించి ఆమోదిస్తేనే వారు రంగప్రవేశం చేయగలరు.

★ ప్రజాప్రతినిధులు, బ్యాంకర్లు తదితరులకు కూడా ఈ తరహా ముందస్తు రక్షణ వర్తిస్తుంది.

★ లంచం తీసుకుంటుండగా పట్టుకొన్న (రెడ్‌హ్యాండెడ్‌గా) కేసులకు మాత్రం ఈ ముందస్తు అనుమతి వర్తించదు.

★ కేసు నమోదైన రెండేళ్లలోగా ప్రత్యేక కోర్టు జడ్జి దానిపై తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. ✧

*(అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లును మార్చాలని ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేత సోనియా గాంధీ, పార్లమెంటులో ఇతర విపక్ష నేతలు, సంబంధిత మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభ సభులకు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ నవంబర్ 24, 2016న లేఖ రాశారు. ఈ వివరాల్ని తెలియజేస్తూ లోక్‌సత్తా వర్గాలు నవంబర్ 26, 2016న ఇచ్చిన మీడియా రిలీజ్ ఇది. దీనితోపాటు మరిన్ని వివరాలతో ఒక నోట్‌ను కూడా జతచేసి జేపీ పంపారు.*

*కొన్ని సాంకేతిక అంశాలలో మినహాయించి జేపీ తన లేఖలో, నోట్‌లో పేర్కొన్న అభ్యంతరాలన్నీ ప్రస్తుతం పార్లమెంటు ఆమోదించిన చట్ట సవరణకూ వర్తిస్తాయి).*

## 'బాధిత ప్రజలనే శిక్షిస్తూ లంచగొండులను రక్షిస్తారా?'.. అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లును మార్చాలని ప్రధాని మోదీ, సోనియా, ఎంపీలకు జేపీ లేఖ

నల్లధనం, దాని చుట్టూ అల్లుకున్న అవినీతిని అంతం చేసేందుకు ఒకపక్క భారీ ప్రక్షాళన చర్యలు చేస్తున్నామంటూనే, మరోవక్క ఆ పోరాటాన్ని నీరుగార్చేలా సవరణలు ప్రతిపాదించిన అవినీతి నిరోధక చట్టాన్ని కేంద్రప్రభుత్వం బిల్లుగా పార్లమెంటు ముందుకు తెస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఇతర విపక్ష నేతలు, సంబంధిత మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్ లేఖ రాశారు. ప్రభుత్వాధికారులపై అవినీతి ఆరోపణలు వచ్చినా ఉన్నతస్థాయి అనుమతి లేకుండా కనీసం దర్యాప్తు కూడా చేయకూడదు కానీ, వ్యవస్థ వైఫల్యానికి బలిపశువులై చిన్న ధ్రువపత్రం కోసం గతిలేక లంచం ఇచ్చినా సామాన్యుడికి క్రూరంగా కనీసం మూడేళ్ల జైలు శిక్ష ఉండాలని ఈ సవరణలు పేర్కొంటున్నాయన్నారు. బాధిత ప్రజలకు శిక్ష – లంచగొండులకు రక్ష అన్నట్టున్న ఈ సవరణల్ని మార్చాలంటూ కొన్ని సూచనల్ని తన లేఖలో చేశారు. వివరాల్ని లోక్‌సత్తా వర్గాలు మీడియాకు విడుదల చేశాయి.

అవినీతి నిరోధక చట్టం, 1988కి కొత్తగా ప్రతిపాదించిన 17 'ఎ' సెక్షన్ వల్ల దేశంలోని దాదాపు 2 కోట్ల మంది ప్రభుత్వోద్యోగులను దర్యాప్తు చేయాలంటే లోక్‌పాల్ లేదా రాష్ట్రాల స్థాయిలో లోకాయుక్త అనుమతి తీసుకోవాల్సుంటుందని జేపీ తన లేఖలో తెలిపారు. "చట్టం ముందు అందరూ సమానమే. అవినీతి ఆరోపణలో ప్రభుత్వాధికారుల దర్యాప్తునకు ప్రత్యేక అనుమతి అక్కర్లేదు" అని మే, 2014లో ఇచ్చిన తీర్పులో స్పష్టంగా పేర్కొంటూ ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సెక్షన్ 6 'ఎ'ని సుప్రీంకోర్టు కొట్టివేసినా మళ్లీ ఈ సవరణని ప్రతిపాదించారన్నారు. విధానపరమైన నిర్ణయాలలో సదుద్దేశంతో పొరపాట్లు చేసిన ప్రభుత్వాధికారులను కచ్చితంగా రక్షించాల్సిందేనని, అయితే అందరు ప్రభుత్వోద్యోగులకూ, అన్ని అవినీతి ఆరోపణలలో రక్షణ కల్పిస్తామనటం రాజ్యాంగ విరుద్ధమని, లోక్‌పాల్,

**FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS**

Following is the text of the letter that DrJayaprakash Narayan sent to PM and Party leaders in LokSabha and RajyaSabha seeking changes in Prevention of Corruption (Amendment) Bill.

****

24th November, 2016

Dear ......

Kindly find enclosed a note on the grave implications of the official amendments proposed to Prevention of Corruption Act, 1988 seeking to incorporate a new Section 17A. This amendment attempts to bring back the discredited Single Directive and the Section 6A of Delhi Special Police Establishment Act (DSPE Act) which was quashed by the Supreme Court in May 2014, and make them applicable to all public servants of all ranks. While the erstwhile Section 6A of DSPE Act provided for mandatory prior approval for investigation of corruption offences against senior officials of the rank of Joint Secretary and above, this new amendment makes such prior approval for investigation in respect of all corruption investigations relating to all public servants. There is need to protect officials involved in policy making or in implementing government policy from vexatious investigation or prosecution. But an omnibus protection to all public servants involved in all forms of corruption defeats the purpose.

Secondly, the proposed Section 8 in the PCA Bill 2013 criminalizes the act of bribe-giving as an independent offence and provides that anyone who offers, promises or gives 'undue advantage' to any person to induce the public servant to perform public duty improperly would constitute cognizable offence. The small bribe giver who is a victim of a dysfunctional system is going to be cruelly punished with a minimum imprisonment of three years, while bribe taker will enjoy immunity, if such a provision is incorporated.

We, therefore, urge you to take corrective action and ensure that the deeply offensive provisions of severe punishment to ordinary citizens who are forced to pay a bribe for services they are entitled to, and protection from investigation of bribe takers of all ranks are suitably amended in the Prevention of Corruption (Amendment) Bill 2013. The following changes are needed in the bill:

1) Removal of omnibus protection to all public servants, in respect of all kind of allegations and providing selective protection in matters relating to policy recommendations and decisions at the Government level.
2) Drawing clear distinction in the definitions part for collusive and coercive corruption.
3) Incorporating fair provisions to give immunity to bribe givers who are victims of extortion and prosecute corrupt officials

The amendments proposed in the Bill in the current form will weaken anti-corruption institutions and undermine the very purpose of the law. I therefore, urge you to take the initiative and ensure that the offensive provisions are altered and a pragmatic, fair, effective anti-corruption regime is in place. The attached note explains the implications of the amendment and suggests the necessary amendments.

With warm personal regards,

**Jayaprakash Narayan**
General Secretary

Encl: Note on implications of official amendments proposed to PC Act

H.No.6-3-1187, Flat No. 801 & 806, Srinivasa Towers, Beside ITC Kakatiya Hotel, Begumpet, Hyderabad – 500 0016, Telangana; Tel: 91-40-23419949; Fax: 23419948

లోకాయుక్తలు గుమాస్తా పనిభారంతో నిర్వీర్యమైపోతాయని అన్నారు. మరోవైపు, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా అందాల్సిన జనన ధ్రువపత్రాలు, తాగునీటి కనెక్షన్, పట్టాదారు పాసుపుస్తకం, విద్యుత్తు అవసరాలు, భూముల రికార్డులు వంటి వాటికి గతిలేక ప్రజలు లంచం ఇస్తామనటాన్ని కూడా నేరంగా నిర్వచించారన్నారు. ఈ సేవలకు లంచాలిచ్చిన సామాన్యులకు కనీసం మూడేళ్ల కారాగార శిక్షను విధించేలా సెక్షన్ 8 పేరుతో సవరణ ప్రతిపాదించారన్నారు. హక్కుగా రావాల్సిన సేవలకు బలవంతపు లంచం ఇవ్వటానికి, లాలూచీ పడి దేశానికి నష్టం వచ్చే పనులకు లంచం ఇవ్వటానికి మౌలికమైన తేడాను ఇందులో ఏమాత్రం గుర్తించలేదన్నారు.

సామాన్య ప్రజలను శిక్షించేలా, అవినీతిని పెంచి పోషించేలా తయారుచేసిన అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లు, 2013లో ఈ దిగువ దిద్దుబాట్లు చేయాలని జేపీ సూచించారు:

1) అన్ని రకాల ఆరోపణలపై అందరు ప్రభుత్వోద్యోగులకు రక్షణ కల్పించే 17 'ఎ' సవరణను తొలగించి, ప్రభుత్వ స్థాయిలో విధాన సిఫార్సులు, నిర్ణయాలకు సంబంధించిన అంశాలలో మాత్రమే ముందస్తు అనుమతి నిబంధనను ఏర్పాటు చేయాలి.

2) లాలూచీ అవినీతికి – గతిలేక లంచం ఇవ్వటానికి మధ్య తేడాని స్పష్టంగా నిర్వచించాలి.

3) గత్యంతరంలేక బలవంతంగా లంచాలిచ్చే వారికి రక్షణ కల్పించటంతోపాటు అవినీతికి పాల్పడ్డ అధికారులను శిక్షించేలా న్యాయమైన నిబంధనలను ప్రవేశపెట్టాలి.

అవినీతి నిరోధక చట్టాన్ని, వ్యవస్థల్ని బలోపేతం చేసేందుకు ఈ దిద్దుబాట్లను చేపట్టాలని విజ్ఞప్తి చేస్తూ సంబంధిత అంశాలను వివరించే నోట్‌ను కూడా తన లేఖకు జత చేసి జయప్రకాష్ నారాయణ్ కేంద్ర ప్రభుత్వానికి, పార్టీలకు, ఎంపీలకు పంపారు. ✧

# ప్రపంచంలో ఎక్కడా లేనంత దిక్కుమాలిన చట్టం

ప్రపంచంలోనే ఎక్కడాలేనంత దిక్కుమాలిన చట్టసవరణను 2013లో యూపీయే ప్రభుత్వం ప్రతిపాదిస్తే.. అవినీతిని అంతం చేస్తానని ప్రతిజ్ఞలు చేసి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం దాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టటం, మిగిలిన పార్టీలన్నీ తందాన అని ఆమోదించటం దేశంలో రాజకీయ శూన్యతకు అద్దం పడుతోందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇలాంటి సవరణతో ఉన్న అవినీతి నిరోధక చట్టం వల్ల దేశంలోని కోట్లాది మంది సామాన్య ప్రజలకు ఎంత నష్టమో కూడా ఆలోచించలేనంత దౌర్భాగ్యస్థితిలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులున్నారన్నారు. బీజేపీ చేస్తున్న ప్రజావ్యతిరేక పనులకు కాంగ్రెస్, ఇతర పక్షాలూ లోపాయికారీగా




సహకరిస్తున్నా యన్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత అవినీతి ఎందుకు ఆగలేదు? అవినీతి అంతానికి ఈ చర్యలు ఎందుకు చేపట్టలేదు? అని గట్టిగా నిలదీయటం కూడా ఆ పార్టీలు చేయలేదన్నారు. అవినీతి నిరోధక చట్ట సవరణలోని లోపాలపై లోక్‌సత్తా జేపీ ప్రధాని దగ్గర్నుంచీ ఎంపీలు సహా అందరికీ లేఖలు రాసినా, కళ్లు తెరవలేదన్నారు. చట్టసవరణల్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేకుంటే రాజకీయ వ్యవస్థ పట్ల ఇంకా చులకన భావం పెరుగుతుందని అన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు మొల్లేటి చిన్నారావు, రాజారావు, గురునాథం, శిమ్మశ్రీను, పీఎల్ఎన్ రాజు, చిన్నారావు, ఎర్నిబాబు తదితరులు పాల్గొన్నారు. ✧

# అవినీతి నిరోధక చట్టానికి ప్రతిపాదించిన సెక్షన్ 17 'ఎ', సెక్షన్ 8ల వల్ల విపరిణామాలు

**(అవినీతి నిరోధక చట్టసవరణ బిల్లులోని లోపాల్ని వివరిస్తూ నవంబర్ 24, 2016న లేఖతోపాటు కేంద్రానికి, ఎంపీలకు లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ పంపిన నోట్ స్థూలపాఠం)**

ప్రభుత్వ నిర్ణయాలలో సదుద్దేశపు సలహాలనిచ్చే, నిర్ణయాలను తీసుకునే పైస్థాయి, సీనియర్ అధికారులను విచారణ పేరుతో నిర్లక్ష్యపూరిత ధోరణితో వేధించటం వల్ల ప్రభుత్వ పాలన కుంటుపడుతుందని మేం అంగీకరిస్తాం. ఇటీవల కొంతమంది ప్రభుత్వాధికారులను వారి చర్యలు, నిర్ణయాలు చట్టబద్ధం అయినప్పటికీ, ఎడతెగని విచారణలతో వారిని వేధించటం వల్ల పాలన అచేతనంగా మారి ప్రజలకు ఎనలేని నష్టం వాటిల్లింది. అందువల్ల ప్రభుత్వస్థాయిలో ఎవరైతే వారి విధులు ప్రభుత్వ విధానాల నిర్ణయాలకు సంబంధించి నిర్వహిస్తారో అటువంటి ప్రభుత్వాధికారులకు విచారణ పేరుతో వేధింపుల నుంచి మినహాయింపు, రక్షణ కల్పించాలని భావిస్తున్నాం. కానీ ఈ మినహాయింపుని 2కోట్ల మంది ప్రభుత్వాధికారులందరికీ వారి విధులతో సంబంధం లేకుండా కొనసాగించటం లేదా పొడిగించటం అనేది అవినీతి నిరోధక శాఖలన్నింటినీ, అవినీతి నిరోధక చట్టాలనూ దెబ్బతీయటమేకాకుండా ప్రభుత్వాలపై మోయలేని భారం మోపుతుంది. తర్వాత అరికట్టలేని అవినీతి సంస్కృతిని ప్రోత్సహిస్తుంది. అవినీతిని అంతం చేయటం సాధ్యంకాదనే వాతావరణం మధ్య అవినీతి తిమింగలాలు తప్పించుకుంటాయి. అందువల్ల ప్రభుత్వోద్యోగులందరికీ రక్షణ స్థానంలో.. ప్రభుత్వ విధాన నిర్ణయాలకు సంబంధించిన అంశాలలో మాత్రమే ఉద్యోగులకు రక్షణ కల్పించాలి.

రెండవది, అవినీతి ప్రబలంగా ఉన్న సమాజంలో ప్రభుత్వోద్యోగులకు వ్యతిరేకంగా




**అవినీతి నిరోధక చట్ట సవరణలోని తప్పిదాలపై ప్రజలను చైతన్యపరిచేందుకు తెలుగు రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలో సమావేశాలు, మీడియా ద్వారా కూడా జేపీ ఎంతో ప్రయత్నం చేశారు. సురాజ్య యాత్రలోనూ ప్రచారం చేశారు. లోక్‌సత్తా నేతలు దీనిపై తెలంగాణ, ఏపీల్లోని పలు జిల్లాల్లో రౌండ్‌టేబుల్ కార్యక్రమాల్ని నిర్వహించారు. పీసీఏ చట్టానికి తలపెట్టిన మతిలేని సవరణలకు వ్యతిరేకంగా 2015-16లో సోషల్ మీడియా ద్వారా జేపీ చేసిన క్యాంపయిన్‌లో ఉపయోగించిన పోస్టర్ ఇది.**

నిర్ణయాత్మక చర్యలను చేపట్టటానికి విశ్వసనీయ ఆధారాలు అవసరం. భారత్ వంటి దేశంలో రోజువారీ చిన్న చిన్న పనుల్లో అవినీతి విస్తృతంగా ఉంటుంది. హక్కుగా సేవలు పొందాల్సిన పౌరులు లేదా బృందాలు ప్రభుత్వ బాధితులుగా ఉంటుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో, లంచం ఇచ్చేవాడికి (గతిలేక బలవంతంగా) రక్షణ కల్పించటం చాలా ముఖ్యం. సర్వవ్యాప్తమైన అవినీతి మధ్య వారికి సేవలు లంచాలు లేకుండా అందటం దుర్లభం. సేవల కోసం వచ్చిన పౌరులను వేధించటం, ధ్రువపత్రాలు, నీరు, విద్యుత్తు కనెక్షన్లు,

పట్టాదారు పాసుపుస్తకాలు, దస్తావేజులు, భవన నిర్మాణ ప్రణాళిక ఆమోదం వంటి వాటికి లంచాలివ్వాల్సిందే. దురదృష్టవశాత్తూ ప్రభుత్వం ఈ వాస్తవాన్ని గుర్తించకుండా లంచం సమర్పించుకునేవారందరినీ శిక్షార్హులను చేస్తూ అవినీతి నిరోధక చట్టంలో సవరణ ప్రతిపాదించింది. సెక్షన్ 8(1) ప్రతిపాదన ప్రకారం, ముడుపులు ఏరూపంలో చెల్లించినా, సాధారణ పౌరులు తమకు హక్కుగా అందాల్సిన సేవల కోసం చెల్లించినా శిక్షార్హులుగా పరిగణించబడతారు. ఈ చట్టం కింద కనిష్టంగా 3 ఏళ్లు, గరిష్టంగా 7 ఏళ్లు జైలు శిక్ష ఉంటుంది.

### సెక్షన్ 17 'ఎ'ని చేర్చటం వెనక నేపథ్యం

1) అవినీతి నిరోధక చట్టం, 1988 కింద దర్యాప్తు సంస్థలకు పూర్తిస్థాయి స్వేచ్ఛను మంజూరు చేయటం జరిగింది. ఆరోపణలను ఎదుర్కొనే ప్రభుత్వోద్యోగులను పూర్తిస్థాయిలో విచారించటానికి ఎటువంటి అనుమతి అక్కర్లేదు. అయినప్పటికీ సెక్షన్ 19 (1), అవినీతి నిరోధక చట్టం 1988 కింద, సెక్షన్ 197 శిక్షాస్మృతి ప్రకారం విచారణకు ముందస్తు అనుమతి అవసరం.

2) 2003లో సెక్షన్ 6 'ఎ' ప్రకారం కేంద్ర దర్యాప్తు సంస్థతో ఢిల్లీ ప్రత్యేక పోలీసు స్థాపన చట్టం, 1946ను ప్రవేశపెట్టింది. ఈ విభాగం జాయింట్ సెక్రటరీ నుంచి పైస్థాయి అధికారులను విచారించుటకు కేంద్ర దర్యాప్తు సంస్థ, ప్రభుత్వం ముందస్తు అనుమతి తీసుకోవాలని ప్రతిపాదించింది.

3) 2014లో ప్రజావ్యాజ్యాలను విచారిస్తూ సుప్రీంకోర్టు సెక్షన్ 6'ఎ'ని కొట్టివేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని, సమన్యాయాన్ని అతిక్రమించటమని పేర్కొంది.

4) ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం.. పెండింగ్‌లో ఉన్న అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లు 2013లో మళ్లీ దీన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం కొత్తగా 17 'ఎ'ని ప్రతిపాదించింది.

### ప్రతిపాదిత 17 'ఎ' విపరిణామాలు

సెక్షన్ 17 'ఎ'ప్రకారం – పోలీసు లేదా దర్యాప్తు సంస్థ.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయమున్న కేసులలో లోక్‌పాల్ అనుమతి తీసుకోవాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి లోకాయుక్త అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలి. ఒకవేళ ప్రభుత్వోద్యోగి అన్ని ఆధారాలతో దొరికిపోతే తప్ప.. అని ఒక సందర్భాన్ని మినహాయించింది. పోలీసు లేదా దర్యాప్తు సంస్థకు చేసిన ఫిర్యాదు లోక్‌పాల్ లేదా లోకాయుక్త అనుబంధ కేసుగా పరిగణించబడుతుంది. లోక్‌పాల్ లేదా లోకాయుక్త ఛాప్టర్ 7, లోక్‌పాల్ మరియు లోకాయుక్త చట్టం 2013 ప్రకారం నిర్దేశిత పద్ధతిలోనే కేసుకు సంబంధించి వ్యవహరించాల్సి ఉంటుంది.

లోక్‌పాల్, లోకాయుక్తలు విచారణకు అనుమతి మంజూరు చేయటానికి తీవ్ర జాప్యం జరిగే అవకాశముంది. లోక్‌పాల్ లేదా లోకాయుక్త అనుమతి లభించక పదుల వందల కేసులకు అనుమతి లభించక విచారణ కుంటుపడుతుంది. భారత్‌లో దాదాపు 2 కోట్ల మంది ఉద్యోగులను ఇలా లోక్‌పాల్, లోకాయుక్త అనుమతి పరిధిలోకి తేవటమంటే అవినీతి నిరోధక వ్యవస్థ, చట్టాలలను స్తంభింపచేయటమే.

రాజ్యసభ కమిటీ ఈ విచారణ అనుమతి మంజూరును కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం చేయాలని సూచిస్తోంది. రాష్ట్రాలలో చాలా కేసులలో విచారణకి అభ్యర్థనను ప్రభుత్వాలే పెండింగ్‌లో ఉంచటం వల్ల.. సాక్ష్యాధారాలు బలంగా ఉన్న కేసులలో కూడా విచారణలో జాప్యం జరుగుతోందని వెల్లడైంది. ఒకవేళ గుమాస్తా లేదా చిన్నస్థాయి ప్రభుత్వోద్యోగి విషయంలో కూడా విచారణకు ప్రభుత్వ అనుమతి కావాలంటే ఇక ఆ కేసులు తేలటంపై ఆశలు వదులుకోవాల్సిందే. ఈ మొత్తం వ్యవహారం ఏళ్లకు ఏళ్లు పట్టటం వల్ల ప్రజలకు ప్రభుత్వం మీద నమ్మకం పోయే ప్రమాదముంది. ఈరకంగా రాష్ట్ర ప్రభుత్వాలు లేదా కేంద్ర ప్రభుత్వం లేదా లోక్‌పాల్, లోకాయుక్తలు ఇవన్నీ అవినీతిని ఎదుర్కోవటంలో విఫలమయ్యే సవరణలు ఇవి. అందరు ఉద్యోగులనూ ఇందులో చేర్చడం అనేది తెలివిమాలిన చర్యేకాకుండా ప్రభుత్వం మీద కూడా అధికభారం మోపుతుంది.

అయితే ప్రభుత్వ నిర్ణయాలలో విధానపరంగా భాగస్వాములయ్యే ఉద్యోగులకు విచారణ వేధింపుల నుంచి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. అటువంటి సందర్భాలలో విధి నిర్వహణలో భాగంగా అధికారి ఆరోపణలు ఎదుర్కొంటున్నందున ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ 17 ఎ (1)ని చేర్చవచ్చు.

### లంచం ఇచ్చే వారిని ప్రాసిక్యూట్ చేయటం:

రాజ్యసభ సెలెక్ట్ కమిటీ నివేదిక ప్రకారం, అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లులోని ప్రతిపాదిత సెక్షన్ 8ను అనుసరించి లంచం ఇవ్వచూపడం నేరపూరిత చర్య, స్వతంత్ర నేరం. ప్రభుత్వాధికారులు వారి విధులు నిర్వర్తించడానికి లంచం ఇవ్వచూపడం, ఇస్తానని వాగ్దానం చేయటం లేదా ఇవ్వడాన్ని విచారణకు అర్హమైన నేరంగా పరిగణిస్తారు. లంచం ఇచ్చేవారికి రక్షణ కల్పించేందుకు సెక్షన్ 8లోని సబ్ సెక్షన్‌ని

ప్రతిపాదించారు. లంచం ఇచ్చేవారు ముందుగా చట్టానికి తెలియచేయటం, దర్యాప్తు సంస్థకు ఉప్పందించటం వల్ల మాత్రమే వారికి ఈ రక్షణ లభిస్తుంది. కానీ రోజువారీ సేవల కోసం సాధారణ పౌరులు బలవంతంగా, గత్యంతరం లేక ఇచ్చే లంచాల నుంచి రక్షణను మాత్రం ఈ సవరణలు ప్రస్తావించలేదు. లంచం ఇచ్చే పౌరుడు/పౌరురాలు వారం రోజులు ముందుగనక పోలీసుకి లేదా చట్టబద్ధ సంస్థకి సమాచారం ఇస్తేనే రక్షణ కల్పించాలని కమిటీ సిఫార్సు చేయటం ఎంత అవాస్తవికంగా ఉంది! అవినీతిపూరితమైన వ్యవస్థలో పౌరులు ఇలా స్పందించగలుగుతారనుకోవటం భ్రమ మాత్రమే. భారతదేశంలోని అధికార స్వభావం, తారతమ్యాలు పౌరులను ఎప్పుడూ బలహీనమైనవారిగానే కొనసాగిస్తూ కిందిస్థాయి ఉద్యోగుల లంచాలకు బలయ్యేలా చేస్తున్నాయి. ఇలాంటి అవినీతి ఉచ్చులో చిక్కుకుని నిస్సహాయంగా ఉన్న పౌరులను నేరస్తులుగా పరిగణించటమనేది అసంబద్ధమైన, అర్థరహితమైన చర్య. ఇలాంటి చర్యలు పౌరుల్ని ప్రభుత్వానికి దూరం చేస్తాయి. అమాయక పౌరులను శిక్షించేలా, లంచగొండి అధికారులను రక్షించేలా సవరణలు ప్రతిపాదించటం అనైతికం. ప్రభుత్వ విశ్వసనీయతనే సందేహాస్పదం చేసే రకంగా ఉన్నాయివి. బలవంతపు అవినీతిని అంతం చేయటం కేవలం సమర్థ సేవల ద్వారానే సాధ్యం తప్ప బాధిత ప్రజలనే శిక్షించటం ద్వారా కాదు.

అయితే, లంచం ఇచ్చే వారిలో ఇంకొక తరగతి కూడా ఉన్నారు. వారి వల్ల ప్రజాశ్రేయస్సు దెబ్బతినటమేకాకుండా అవినీతితో ప్రభుత్వోద్యోగులు కూడా ఆర్జిస్తుంటారు. ఒప్పందాలు, సహజ వనరుల కేటాయింపు, లైసెన్సులు, నియామకాలు, అధికారుల బదిలీల మంజూరు, సాక్ష్యాల్ని సమకూర్చటం, ప్రాసిక్యూషన్‌ను అనుచితంగా ప్రభావితం చేయటం, చట్టాన్ని అతిక్రమించటం, ఖజానాని దోచుకోవటం, అధర్మ పోటీ, ప్రజలకు అందాల్సిన సేవల నాణ్యతను దెబ్బతీయటం, సాధారణ పాలన గాడితప్పేలా చేయటం వంటి వాటికోసం లంచాలిచ్చేవారుంటారు. ఇలాంటి లాలూచీ లంచాలిచ్చేవారిని మాత్రం కఠినంగా శిక్షించటం అవసరం.

ఇప్పుడున్న చట్టాలు మాత్రం ఇందుకు అనుగుణంగా లేకపోగా విరుద్ధంగా ఉన్నాయి, తయారవుతున్నాయి. రెండవ పరిపాలనా సంఘం సిఫార్సుల ప్రకారం, లాలూచీ అవినీతి కేసులలో శిక్షల్ని పెంచాలి, ప్రాథమిక సాక్ష్యాధారాలుంటే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యతను నిందితునిమీదే ఉంచాలి.

**కాబట్టి.. లాలూచీ అవినీతికి, గతిలేక బలవంతంగా ఇచ్చే లంచాలకు మధ్య స్పష్టమైన గీత గీయాల్సుంది. ఈ రెంటినీ వేరుచేస్తూ నిర్వచనాన్ని చట్టంలో పొందుపరచాల్సి ఉంది. ఇందుకు కొన్ని ప్రమాణాలు:**

* లంచం ఇచ్చేవాడికి ఏదైనా అనుచితమైన, అనర్హమైన లబ్ధి చేకూరుతోందా?
* ఏదయినా మోసం, మాయ లేదా పోటీని దెబ్బతీసే ప్రయత్నముందా?
* ఖజానాకు నష్టం జరుగుతోందా?
* అనర్హులకు లాభం కలిగేలా నిర్ణయం తీసుకోవటంపై లంంచం ప్రభావం ఉందా?
* అవినీతి వల్ల ప్రజలకు అందాల్సిన సేవలు, వస్తువులలో నాణ్యత దెబ్బతిందా?
* భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించటం ద్వారా ప్రజాప్రయోజనాలకు, పర్యావరణానికి హాని జరిగిందా?

పైన పేర్కొన్న అంశాలలో ఏ ఒక్కదానికి సమాధానమైనా అనుకూలంగా వస్తే అటువంటి కేసును లాలూచీ అవినీతి కేసుగా పరిగణించాలి. అందువల్ల అవినీతి నిరోధక చట్టసవరణ బిల్లులోని సెక్షన్ 7లో లాలూచీ అవినీతిని నిర్వచించాల్సి ఉంది. ఖజానా, ప్రజాప్రయోజనాలు దెబ్బతింటున్న అవినీతి కేసులన్నీ లాలూచీ కేసులే. ఇలాంటి కేసులలో, ఇంతకుముందే చెప్పుకున్నట్టు శిక్షలు మరింత ఎక్కువగా ఉండాలి. ప్రజాప్రయోజనాలను దెబ్బతీసేలా వ్యవహరించిన ప్రభుత్వాధికారిని, అందుకు లంచం ఇచ్చినవారితో సహా అవినీతి కేసులో విచారణ చేయవచ్చు. కానీ గతిలేక లంచాలిచ్చేవారికి మాత్రం పూర్తి రక్షణ కల్పించాలి.

బలవంతంగా గతిలేక లంచాలిచ్చే సమస్యకు పరిష్కారం శిక్షలలో కాకుండా సమర్థమైన ప్రభుత్వ సేవలలోనే ఉంటుంది. ప్రజలకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన సేవల్ని అందించటం, ఆలస్యమైతే పరిహారం చెల్లించటం కోసం 'పౌరసేవల' (సర్వీస్ గ్యారంటీ) చట్టాన్ని అమలుచేయాలి. అధ్వాన్న వ్యవస్థ వల్ల లంచాలిస్తున్న సామాన్య ప్రజలను నేరస్తులను చేయాలనుకోవటం విపరీత ధోరణే అవుతుంది. అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లులోని ఈ లోపాల్ని తొలగించి పౌరసేవల చట్టాన్ని తీసుకురావాలని పార్టీలకతీతంగా పార్లమెంటు సభ్యులను కోరుతున్నాం.

(పూర్తి వివరాలున్న ఈ నోట్ ఆంగ్లమూలాన్ని www.fdrindia.org లో చదవవచ్చు) ✧

(డిసెంబర్ 17, 2016న హైదరాబాద్ కార్యాలయంలో లోక్‌సత్తా నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం మీడియా రిలీజ్)..

# సామాన్య ప్రజలను జైలుకు పంపుతూ లంచగొండులకు అండగా ఉండే.. అవినీతి నిరోధక చట్ట సవరణల్ని వ్యతిరేకిద్దాం: సీఐసీ మాడభూషి శ్రీధర్




కేంద్ర ప్రభుత్వం అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లుకు అధికారికంగా ఆమోదించిన సవరణలు.. అవినీతిపరులను రక్షించే విధంగా, లంచాల బాధితులుగా ఉన్న సామాన్య ప్రజలను శిక్షించే విధంగా ఉన్నాయని, వీటిని సరిదిద్దేవరకు ప్రజాప్రతినిధులు, సంఘాలు, ప్రజలు పార్టీలకతీతంగా పోరాటం చేయాలని కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. పరిజ్ఞానంతో ప్రశ్నించటం అలవాటు చేసుకుని ప్రభుత్వాలు చేపట్టే ప్రజా వ్యతిరేక చర్యలను ప్రతిఘటిస్తుంటేనే జనం జీవితాలు బాగుపడతాయన్నారు.

**అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లులోని తప్పుడు సెక్షన్లకు వ్యతిరేకంగా తొలి నుంచీ పోరాడుతున్న లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజీగూడలోని కేంద్ర కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి లోక్‌సత్తా ఉద్యమసంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు అధ్యక్షత వహించారు.**

**మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ..** అవినీతి నిరోధక చట్టానికి ప్రస్తుతం చేసిన సెక్షన్ 8 సవరణ లంచాల బాధితులైన ప్రజలనే శిక్షించే విధంగా ఉందన్నారు. లంచం తీసుకోవడం ఎంత నేరమో, ఇవ్వడమూ అంతే నేరం అన్న సహజ సూత్రాన్ని దోపిడీదారులతో కుమ్మక్కయి లంచాలిచ్చేవారికి వర్తింపచేస్తారుగానీ.. హక్కుగా రావాల్సిన సేవలకు గతి లేక లంచాలు ఇచ్చే సామాన్యులను వర్తింపచేస్తారా? అని ప్రశ్నించారు. లంచం ఇచ్చేవాడికి, పుచ్చుకునేవాడికి పరస్పర లాభం ఉండి, దేశానికి నష్టం జరిగే 'క్విడ్ ప్రోకో' లాంటి కేసుల్లో మాత్రమే లంచం ఇచ్చేవారిని శిక్షించేవిధంగా చట్టాన్ని మార్చాలన్నారు. మరోపక్క, లంచం తీసుకునే అధికారిని మాత్రం ప్రాసిక్యూట్ చేయటం మాట అలా వుంచి, కనీసం దర్యాప్తు చేయటానికి కూడా ముందస్తు అనుమతి కావాలనే దారుణమైన 17 'ఎ' సవరణను ఇందులో చేర్చారన్నారు. ఈ సవరణల్ని తొలగించేలా పార్టీలకతీతంగా లోక్‌సత్తా చేస్తున్న కృషిని అభినందించారు. సమాచార హక్కు చట్టం, నోట్ల రద్దు, నల్లధనం, అవినీతిపై పలు ప్రశ్నలకు ఈ సందర్భంగా శ్రీధర్ జవాబిచ్చారు.

అవినీతి నిరోధక చట్టానికి ప్రభుత్వం ఆమోదించిన దుర్మార్గపు సవరణలకు వ్యతిరేకంగా ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, సంబంధిత మంత్రులు, పార్లమెంటు సభ్యులందరికీ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ లేఖలు రాశారని, రౌండ్‌టేబుల్ సమావేశాలు, మీడియా ద్వారా కూడా ప్రజలను చైతన్యపరిచే ప్రయత్నాలు చేస్తున్నామని **బండారు రామ్మోహనరావు** తెలిపారు. ఈ సవరణల్ని తొలగించి.. కుమ్మక్కయి లంచం ఇచ్చేవారికి మాత్రమే శిక్షల్ని పరిమితం చేసేలా, ప్రభుత్వ విధానాలలో భాగంగా తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి మాత్రమే అధికారులకు రక్షణ కల్పించేలా కొత్త సవరణల్ని చేయాలన్నారు. అవినీతిపరుల ఆస్తుల్ని జప్తు చేసే ఏర్పాటును కూడా సవరణల్లో చేర్చాలన్నారు.

సమావేశంలో లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీశైలం, లోక్‌సత్తా ఉద్యమసంస్థ మాజీ కన్వీనర్లు టీఎల్ నరసింహారావు, ఎన్. శ్రీనివాస్, కోశాధికారి పి.భాస్కరరావు, ఆర్‌టీఐ కార్యకర్తలు, విద్యార్థిసత్తా, యువసత్తా నాయకులు పాల్గొన్నారు. ✧

# 'ప్రజలకు జైలు.. అవినీతి అధికారులకు ముద్దు' అనే మోదీ చట్టసవరణను ఒక్క పార్టీ కూడా ఎందుకు ప్రశ్నించటం లేదు?

"మనం పన్నులు కడుతున్నాం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు ఫీజులు కడుతున్నాం, కాబట్టి హక్కుగా ఆ సేవలు అందాలి. వాటికి లంచం అడిగేవాళ్ల భరతం పట్టే వ్యవస్థను ఏర్పాటు చేయటం చేతగాక, ధైర్యం లేక.. ఓ సర్టిఫికెట్ కోసం గతిలేక లంచం ఇచ్చే ప్రజల మీద కేసులు పెట్టి జైల్లోకి పంపిస్తామనే చట్టాన్ని తీసుకు రావటాన్ని పరిపాలన అంటామా?" అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ ప్రశ్నించారు.

ఇలాంటి పాలకులుంటే పనామా పత్రాలు, ప్యారడైజ్ పత్రాల్లో భారతీయులు పేర్లు నిరంతరం వస్తూనే ఉంటాయన్నారు. ఏదైనా అవినీతి కుంభకోణం జరిగితే 'సిట్' వేశాం, మరో కమిషన్ వేశాం అని భారీ ప్రసంగాలు చేయడం, బీరాలు పలకడం తప్ప, దేశంలో రోజూ ప్రభుత్వ కార్యాలయాల్లో పెరిగిపోతున్న లంచాల్ని ఆపేందుకు పౌర సేవల చట్టం వంటి కనీస చర్యలు కూడా తీసుకోలేని అసమర్థ, అవగాహనారహిత పాలన రాష్ట్రంలో, దేశంలో కొనసాగు తోందని జేపీ అన్నారు. ఏ ప్రభుత్వ అధికారిని ఏసీబీ పట్టుకున్నా వందల కోట్ల ఆస్తులు కనబడుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో, రాజస్తాన్‌లో అవినీతి నిరోధక చట్టానికి చేస్తున్న సవరణలు పరిపాలననే అపహాస్యం చేస్తున్నా యన్నారు. పాలనకు అర్థం తెలిసిన వారెవరూ ఇలాంటి చట్టాల్ని తీసుకురారన్నారు.

గతి లేక లంచం ఇచ్చిన పౌరులకు 3 నుంచి 7 ఏళ్ల జైలు శిక్ష, లంచం తీసుకున్న ఉద్యోగుల మీద మాత్రం విచారణకు కూడా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలి అంటూ కేంద్రంలోని ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టాన్ని భ్రష్టుపట్టిస్తూ సవరణను తీసుకొస్తున్నా ఒక్క రాజకీయ పార్టీ అయినా ఎందుకు ప్రశ్నించటం లేదని జేపీ నిగ్గదీశారు. అవినీతిపై పోరాటాలు చేస్తున్నాం, నిప్పులాంటి వాళ్లమని చెప్పుకుంటున్న పార్టీలన్నీ ఇంత బరితెగించి ప్రజలను దోషులుగా చేస్తుంటే ఎందుకు కిమ్మనటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టానికి తూట్లు పొడుస్తూ తీసుకొస్తున్న సవరణపై పార్లమెంటులోని అన్ని పార్టీల సభ్యులకు, అధ్యక్షులకు తాను లేఖలు రాశానని, అన్ని వివరాలనూ తెలిపానని, అయినా మూగ, చెవుడు, గుడ్డిలా ఆ చట్టానికి మద్దతు తెలుపు తున్నారన్నారు. తాను నిజాయతీపరుడినని ప్రధానమంత్రి మోదీ చెప్పుకుంటున్నారని.. ఇలాంటి చట్టాన్ని తీసుకొస్తూ ఆయన నిజాయతీగా ఉండి ఏం లాభమని జేపీ ప్రశ్నించారు. ప్రస్తుతం పాలన జరుగుతున్న తీరును చూస్తుంటే, కొన్నాళ్లకు లంచాన్ని చట్టబద్ధం చేసినా ఆశ్చర్యపోనక్కర్లే దన్నారు.

సింహపురి సురాజ్య యాత్రలో భాగంగా జయప్రకాష్ నారాయణ్ నెల్లూరు నగరంలో యువత, వివిధ వర్గాల ప్రజలతో, మీడియాతో సమావేశమయ్యారు. విద్య, ఆరోగ్యం, లంచాల్లేని ప్రభుత్వ సేవలు, పంచాయతీలు, మునిసిపాలిటీలకు అధికారాలు, నిధులు, చట్టబద్ధపాలన, వ్యవసాయంలో ఆదాయం తదితర అంశాలపై లోతుగా చర్చించారు. ప్రశ్నిస్తూ, జవాబులిస్తూ, అభిప్రాయాలు తెలుసుకుంటూ పరిష్కారాలను అందిస్తూ కార్యోన్ముఖుల్ని చేశారు.

విదేశాల్లో భారతీయులు దాచుకున్న నల్లధనంలో వెలుగుచూసింది చాలా తక్కువ అని జేపీ అన్నారు. మనదేశంలో నుంచి ఏటా లక్షల కోట్లు బైటికి ధారాళంగా పోతున్నా పట్టించుకోకుండా నల్లధనాన్ని వెనక్కిరప్పిస్తున్నామంటూ కబుర్లతో మభ్యపెడుతున్నారన్నారు. మనదేశానికి చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు విదేశాల్లో ఎందుకు పెట్టుబడులు పెడుతున్నారో ఆలోచించే విజ్ఞతను కూడా పాలకులు కనబరచలేకపోతున్నారన్నారు. నేతలు, అధికారులు కలిసి ఇష్టమొచ్చినట్టు పందేరం చేస్తూ, దోచేస్తుంటే, పన్నుల రూపంలో ఆ డబ్బును కట్టిన ప్రజలు మాత్రం చేయి జాచి అడుక్కుంటున్నారని అన్నారు.

నిధుల వినియోగాన్ని కూడా అవినీతికి ఆస్కారమిచ్చేలానే పాలకులు చేస్తున్నరని జేపీ అన్నారు. కేంద్రం నుంచి బడ్జెట్‌లో 51శాతం రాష్ట్రాలకు వస్తుంటే, దాంట్లో వెయ్యికి ఒక్క రూపాయి కూడా స్థానికంగా పంచాయతీలు, మునిసిపాలిటీలకు రావడం లేదన్నారు. సుమారు 6లక్షల జనాభా ఉన్న నెల్లూరు నగర ప్రజల పేరు మీద రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.1800 కోట్లు ఖర్చు చేస్తోందని, ఇక్కడేం చేయాలో అమరావతి నుంచి నిర్ణయిస్తోందని అన్నారు. ఇలాంటి నిర్ణయాలే అవినీతికి దన్నుగా మారుతున్నాయని అన్నారు. నెల్లూరులో జరగాల్సిన పనుల్ని నెల్లూరువారే నిర్ణయించుకోవాలని, ఇందుకోసం సగం డబ్బుల్ని రాష్ట్రం స్థానికంగా ఇక్కడికి ఇచ్చేయాలని అన్నారు. ప్రపంచంలో మరే దేశంలోనూ కనిపించనంత అధ్వాన్నమైన పాలనా విధానాలను అనుసరిస్తూ గొప్ప నాయకులుగా ఫోజులిస్తున్నారన్నారు. విద్యలో ఒక్కో స్కూలు విద్యార్థి మీదా ఏపీ ప్రభుత్వం ఏటా రూ.60,000 ఖర్చు చేస్తోందని, కానీ చదువు మాత్రం అధ్వాన్నంగా ఉందని అన్నారు. వ్యవసాయంలో రైతుకు లాభాలు రాకుండా అన్ని రకాలుగా నడ్డివిరిచే విధానాలను అనుసరిస్తూ, రైతే రాజు వంటి నినాదాలు, రుణమాఫీలు వంటి విధానాలతో మభ్యపెడుతున్నారన్నారు.

ఢిల్లీ, అమరావతి, హైదరాబాద్‌లలో కూర్చోవటం కాదు, మా వద్దకు వచ్చి మా సమస్యల్ని పరిష్కరించే స్పష్టమైన విధానాలను చెప్పండి, అమలు చేయండి అని ప్రశ్నించినప్పుడే ప్రజాస్వామ్యంలో చైతన్యం వస్తుందని, సురాజ్యం సాకారమవుతుందని జేపీ అన్నారు. ఈ దిశగా యువతకు, ఇతర ప్రజలకు తోడ్పాటునివ్వడానికే యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ అనే వెబ్ ప్లాట్‌ఫారాలను అందుబాటులోకి తెచ్చామని, వాటిలో ఆలోచనల్ని, సూచనల్ని పంచుకోవాలని, కార్యాచరణల్లో పాలుపంచుకోవాలని సూచించారు.

లోక్‌సత్తా నేతలు బండారు రామ్మోహనరావు, బాలసుబ్రమణ్యం, ప్రజాసైన్స్ కార్యదర్శి మాల్యాద్రి, బుచ్చిరాజు, నారాయణ, శ్రీనివాసులు, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ✧

# 'ఎల్లో ఎల్లో.. కరప్ట్ ఫెలో'.. ఎదుర్లంకలో తెదేపా ఎమ్మెల్యే ప్రజాకంటక చర్యలను అడ్డుకున్న లోక్‌సత్తా ఎంపీటీసీ

తెలుగుదేశం 'తోడుదొంగల పార్టీ' అని మరోమారు రుజువు చేసుకుందని లోక్‌సత్తా పార్టీ ఎంపీటీసీ (ఎదుర్లంక, తూర్పు గోదావరి జిల్లా), రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్ ముదునూరి ధ్వజమెత్తారు.

ఎదుర్లంకలో చమురు/సహజ వాయువు వెలికితీత కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆయిల్ ఇండియా లిమిటెడ్ తన సామాజిక సేవా బాధ్యతలో భాగంగా గ్రామానికి రూ.2 కోట్లు దాకా నిధుల్ని కేటాయించిందని, వాటితో ప్రజల అవసరాలను, ఆకాంక్షలను తీర్చే ప్రయత్నాలకు స్థానిక ఎమ్మెల్యే (ముమ్మిడివరం నియోజకవర్గం) అడ్డపడుతున్నారన్నారు. నిధుల్ని సొంతానికి మళ్లించుకుంటున్నారని, అనుచరులకు పందేరం చేస్తున్నారని అన్నారు. గ్రామాన్ని పీడిస్తున్న మంచినీటి కొరతను తీర్చేందుకు ఆయిల్ ఇండియా సీఎస్ఆర్ నిధులను వినియోగించుకుందామని, మినీ స్లో శాండ్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసుకుందామని తాను గ్రామస్తులను ఒప్పిస్తే.. వీల్లేదంటూ రూ.43 లక్షల నిధుల్ని బలవంతంగా విడుదల చేయించి సంప్‌ని నిర్మించారని రాజశేఖర్ తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ వాటర్ ప్రాజెక్టు గ్రిడ్‌తో కనెక్ట్ చేసిన ఆ సంప్‌లోకి ఇప్పటిదికా నీటి చుక్క రాలేదన్నారు. పనికిరాకుండా పడివున్న సంప్‌ని చూపిస్తూ ప్రజలడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్న ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఇప్పుడు జనం సొమ్మును పంచుకోవటానికి కొత్త ఎత్తుగడ వేశారన్నారు.

''నిధుల్లో మిగిలిన కోటిన్నర రూపాయలతో గ్రామంలో 48 సీసీ రోడ్డు పనులు చేయాలంటూ ఎమ్మెల్యే ఓ జాబితాను ఇచ్చారు. ఇందులో చాలా పనులు హాస్యాస్పదమైనవి, ప్రైవేటు వ్యక్తులకు తప్ప ప్రజలకు ఉపయోగం లేనివి. ప్రాథమికోన్నత పాఠశాల వరకు ప్రతిపాదించిన సీసీ రోడ్డు దూరం 3 మీటర్లు కాగా, అంచనా వ్యయం మాత్రం రూ.3.6 లక్షలు. అలాగే కొందరి ఇళ్ల ముందు రోడ్లను బాగు చేయటానికి నిధుల్ని అడిగారు. ఇవి 10 నుంచి 30 మీటర్ల దూరం పరిధిలో ఉన్నవే'' అని రాజశేఖర్ తెలిపారు.

పంచాయతీకిగానీ, ఎంపీటీసీగా ఉన్న తనకు గానీ సమాచారం కూడా లేకుండా గుట్టుగా ఎమ్మెల్యే చేస్తున్న ఈ ప్రాజెక్టులను వెంటనే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌కు, ఆయిల్ ఇండియా అధికారులకు లేఖ రాశానని, దోపిడీదారుల సంగతిని ప్రజల్లోకి పెద్దఎత్తున తీసుకెళ్తానన్నారు. లోక్‌సత్తా ప్రతిపాదించిన శాండ్ ఫిల్టర్‌కు 3 ఎకరాల పంచాయతీ చెరువును ఉపయోగించుకోవాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా నిర్ణయించారని, ఇది రోజువారీ మంచినీటి వనరుగా, వేసవి స్టోరేజీ ట్యాంకుగా మాత్రమేకాకుండా 10 నెలలపాటు సాగు అవసరాలకు ఉపయోగపడుతుందని, నిర్వహణ కూడా తేలికని రాజశేఖర్ తెలిపారు. మిగిలిన సీఎస్ఆర్ నిధులను ఇందుకు కేటాయించాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి, కంపెనీ అధికారులకు తెలియచేశామని వివరించారు.

కృష్ణా జిల్లా మాట్లం గ్రామంలో ప్రత్యేకాధికారుల పాలనకు ముందు ఉన్న లోక్‌సత్తా సర్పంచ్‌ని కూడా ఇదేరీతిలో ఎమ్మెల్యే, జన్మభూమి కమిటీలు వేధించి ప్రజలకు పనికొచ్చే పనులు చేయకుండా అడ్డుకున్నారన్నారని.. డబ్బు ఎన్నికలు, పెత్తందారీ పాలన ఎల్లకాలం సాగవని తెలుగుదేశం నేతలు గుర్తిస్తే మేలని రాజ్ ముదునూరి హెచ్చరించారు. ✧

# నిజాయతీకి నివాళి!

-కృతి.




**బ**క్కచిక్కిన బడుగు జీవి ఒళ్లు బలిసి.. ఖాళీ జేబు నిండా డబ్బు పులిసి... పూరిగుడిసెలో రాశి పోసిన సొమ్మును ఏం చేసుకోవాలో తెలియక... తన కంటే కడహీనంగా బతికే పేద ప్రభుత్వ ఉద్యోగి పడుతున్న కష్టాలు చూసి చలించి... అతడి బతుకు బాధను కొంతైనా భరించి ఆదుకుందామనే సదుద్దేశంతో కదా... చిరిగిన బట్టలతో చచ్చీచెడీ ఆఫీసుకు వెళ్లి... కన్నీళ్లలా కారే ఆనంద బాష్పాలను కనురెప్పల చాటునే దాచుకుని... బల్ల దాటునో, బడ్డీ కొట్టు మాటునో గుప్త దానం చేసేది! ఇంత గొప్ప సహానుభూతిని లంచం అంటూ భారతీయ సమాజం ఇన్నాళ్లూ తప్పుగా అర్థం చేసుకుంది. లంచ్ అవర్‌ని, 'లంచ'వర్‌గా అపోహపడింది. సర్వసత్తాక సార్వభౌమాధికార గణతంత్ర భారతదేశానికి మహాప్రభువులైన సామాన్య ప్రజలకు... వారి సేవకులైన ఉద్యోగులకు మధ్య జరిగే సామరస్య సానుభూతిపూర్వక, సుహృద్భావ లావాదేవీకి లంచం అనే దుష్ట దుర్మార్గపు పేరు తగిలించి అటు ప్రభువులను, ఇటు వారి సేవకులను అవమానించింది. ఈ నీచ నికృష్ట చరిత్రకిక చెల్లు. ఇక దేశంలో లంచం అనే మాటే వినిపించకపోవచ్చు!

'నేరం చేయడమే కాదు, నేరాన్ని ప్రోత్సహించడం కూడా నేరమే' అనే నేర నీతి శిక్షాస్మృతి ఆధారంగా 'లంచం తీసుకున్నవాడే కాదు, లంచం ఇచ్చినవాడు కూడా దోషే' అని మన పార్లమెంటు మొన్ననే మహత్తర చట్టమొకటి చేసింది. లంచం తీసుకున్న వాడికి ఎంత శిక్షో, ఇచ్చిన వాడికి కూడా సరిగ్గా అంతే శిక్ష వేయాలని ఆజ్ఞాపించింది. పైకి చూస్తే ఇదొక తలతిక్క పిచ్చిలెక్కలా కనిపించవచ్చు. కానీ మహానుభావుల అంతరంగాలు... మనలాంటి మామూలు వాళ్లకు బాగా ఆలోచిస్తే గానీ అవగతం కావు! ఇప్పటిదాకా లంచం తీసుకునేవాడు మాత్రమే దోషి! అంటే ఇచ్చేవాడు కాదనే కదా! లంచం తీసుకునేవాడు నిందితుడు, ఇచ్చేవాడు బాధితుడు అన్నది ఇందులో లాజిక్. దీనివల్ల బాధితుడికి ఫిర్యాదు చేసే హక్కు లభిస్తుంది. ఫిర్యాదు అనే ప్రక్రియ ఉన్నదంటేనే అవినీతి ఉనికికి ఆధారం పడ్డట్టు. రికార్డుల్లోకి ఎక్కినట్టు. నిందితుడిని బాధితుడిని ఇద్దరినీ శిక్షార్హుల్ని చేస్తే ఇక ఫిర్యాదే ఉండదు. ఫిర్యాదే రానప్పుడు లంచం సంగతి ఎలా బయటపడుతుంది?! అయినా ఎవడైనా సోకాల్డ్ నిజాయతీపరుడు ఫిర్యాదు చేస్తా అని మొండికేశాడనుకోండి! పై అధికారి అనుమతి ఉంటే తప్ప కేసు రాయరు. అప్పుడు కూడా 'బలహీనుడైన ఉద్యోగి' తనను తాను రక్షించుకోవచ్చు. సదరు వ్యక్తే తనకు లంచమివ్వబోయాడని ఉల్టా ఫిర్యాదు చేయవచ్చు. పక్క టేబుల్‌లో కూర్చున్న ఉద్యోగి అందుకు సాక్ష్యమివ్వవచ్చు. కేసు నమోదుకు ఎవరి అనుమతీ అక్కర్లేదు. దీంతో సోకాల్డ్ నిజాయతీపరుడు దెబ్బకు దారికొస్తాడు. మొత్తమ్మీద అవినీతిపై అఫీషియల్ డేటా దొరక్క... భారత్‌ను జాబితాలోకి ఎక్కించలేక... ట్రాన్స్‌పరెన్సీ ఇండియా చేతులెత్తేస్తుంది. దీనివల్ల దేశంపై అవినీతి మరక క్రమంగా చెరిగిపోతుంది!

లోతుగా ఆలోచిస్తే లంచం ఉభయతారకమైనది. లంచం తీసుకునే ఉద్యోగికి పదో పరకో ముడుతుంది. లంచం ఇచ్చేవాడికి కోరుకున్న పని జరుగుతుంది. ఒకే ప్రభుత్వ ప్రక్రియలో ఇద్దరూ లబ్ధి పొందినప్పుడు ఒక దోషి అనీ, మరొకరు దోషి కాదనీ ఎలా వివక్ష చూపించగలరు. అందువల్ల ఇద్దరినీ ఒకే గాటన కట్టి, వారి మధ్య ఒక సదవగాహన కల్పించడమే సముచితం. మహా ప్రభువులైన ప్రజలకు, వారి సేవకులైన ఉద్యోగులకు మధ్య సత్సంబంధాల బాట వేయడమే కొత్త చట్టం పిండితార్థం. దీనివల్ల

ప్రజలు, ఉద్యోగులు ఇద్దరూ ఎంచక్కా కుమ్మక్కై ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో పనులు చేసుకుంటారు. తత్ఫలితంగా ప్రభుత్వ ఆఫీసులు ఎలాంటి గొడవలు, వివాదాలు లేకుండా సాఫీగా నడుస్తాయి. లంచాన్ని వ్యవస్థీకృతం చేయడంలో ఇది తొలిమెట్టు. సర్కారు వారిచ్చే జీతంతో పాటు అదనపు ఆదాయం లభిస్తున్నందున ఉద్యోగులు టైమ్‌కన్నా ముందే ఆఫీసులకు వస్తారు. పని వేళలు ముగిసిన తర్వాత కూడా ఒళ్లు వంచి కష్టపడేందుకు ఈ విధానం ఉత్ప్రేరకంగా ఉపకరిస్తుంది. ఫిర్యాదులు, కేసులు, విచారణలు, శిక్షల వంటి భయాలేవీ లేకపోవడం వల్ల ఉద్యోగుల వర్క్ ఎఫిషియెన్సీ లెవెల్స్ పెరిగి, ఇద్దరు చేసే పనిని 'ఒక్కరే' చేసేందుకు ఉత్సాహం చూపిస్తారు. అవినీతి ఫిర్యాదులు ఉండని కారణంగా ఏసీబీ, విజిలెన్స్ వంటి విభాగాలు మూసేయవచ్చు. అసలే దివాలాలో ఉన్న ప్రభుత్వానికి దీనివల్ల బోలెడంత డబ్బు మిగులుతుంది. కేసులతో సతమతమవుతున్న పోలీసులు, న్యాయవ్యవస్థపై కూడా... కొత్త కేసులు లేకపోవడం వల్ల పనిభారం తగ్గుతుంది. చూశారా... ఒక్క చట్టంతో ఎన్ని మేళ్లో! మామూలు వాళ్లా మన నేతలు!

కానీ ఇది ఎంతమాత్రం సరిపోదు. అవినీతి నిరోధక చట్టాన్ని పూర్తిగా సవరించాలి. లంచం, ముడుపు, బ్రైబ్, కమీషన్, రిశ్వత్ వంటి అప్రతిష్ఠాకర, జుగుప్సాకర, దరిద్రపుగొట్టు మాటలను పూర్తిగా నిషేధించాలి. లంచగొండి, లంచావతారం, లంచానికి మంచం, వలలో పెద్ద చేప, ఉత్తర 'దక్షిణ', బరువు పెట్టడం, జీతం గీతం, ఆమ్యామ్యా వంటి జాతీయాల వాడకాన్ని ఆపేయాలి. భావి తరాలకు తెలియకుండా నిఘంటువుల నుంచి వీటిని తొలగించేందుకు భాషావేత్తలతో ఒక కమిటీ వేయాలి. లంచానికి బదులు రుసుము, పర్సనల్ ఫీజు, సర్వీస్ చార్జి, హానరోరియం, కృతజ్ఞతా సమర్పణం, ధన్యవాద కానుక వంటి గౌరవప్రదమైన మాటనొకటి కనిపెట్టాలి. బల్లకింద చేతులు పెట్టినట్టుగా వేసే కార్టూన్లను సెన్సార్ చేయాలి. అవినీతి పేరుతో ఆడిపోసుకునే పత్రికలపై ఆంక్షలు విధించాలి. భారతీయుడు, ఒక్కడు, ఠాగూర్, అపరిచితుడు వంటి సినిమాలు తీయకుండా సెన్సార్ బోర్డుకు మార్గదర్శకాలు ఇవ్వాలి. ప్రతి ఆఫీసులోనూ ఏ పని, ఎంత కాలంలో చేస్తే ఎంత ఇవ్వాల్సి ఉంటుందో సిటిజన్ ఛార్టర్ బోర్డులు పెట్టాలి.

లంచం 16వ శతాబ్దిలోనే ఉందని పళని వద్ద రాగి ఫలకం బయటపడింది. నిప్పులాంటి నిజాయతీ నితీశ్‌కుమార్ మొన్న ఏమన్నాడు? హత్యలు నేరమని చట్టం చేశాం. హత్యలు ఆగడం జరిగిందా? మద్యపానం నేరమని చట్టం చేశాం. అంతమాత్రాన మద్యం తాగడం ఆపుతారా? అని! ఇదీ అంతే. నేరం అన్నంత మాత్రాన లంచం ఆగిపోతుందా? బెంగాల్ సీఎం మమతాబెనర్జీ తనను తాను లోకాయుక్త పరిధి నుంచి మినహాయించుకోలేదా!

ముఖ్యమంత్రులకు లేని శిక్షలు ఉద్యోగులకే ఎందుకు? నెలకొచ్చే నాలుగు రాళ్లలోనే కడుపు కట్టుకుని, నోరు కుట్టుకుని పైసాపైసా మిగుల్చుకుని ఆస్తులు కొనుక్కుంటే, వాటి ధర కాస్త పెరిగి కోట్లలోకి చేరితే, అవినీతి అక్రమాస్తులంటూ ఏసీబీ దాడులు చేయడం ఏం సబబని తెలంగాణ ప్రభుత్వం ఆందోళన చెందలేదా! అయినా లంచం ఎక్కడ లేదు? కొన్ని దేశాల్లో విధిబద్ధంగా చేసే పనులకు జీతం, చట్టానికి అతీతంగా చేయాల్సిన పనులకు లంచం తీసుకునే సంప్రదాయం ఉంది. మరికొన్ని దేశాలు ఫీజులు, కమీషన్లు, లాబీయింగ్ పేర్లతో లంచాన్ని చట్టబద్ధం చేశాయి. మనం వాటికన్నా ఒకడుగు ముందుండాలి కదా! అందువల్ల విధి నిర్వహణలో చేయాల్సిన పనులకూ లంచం తీసుకుంటాం. ఇవన్నీ ఆలోచించే మోదీగారు.. పుట్టుక నుంచి చావుదాకా ఆపలేని లంచానికి, ఆగని దందాకు పేరు గొప్ప చట్టమొకటి ఎందుకని ఇలా చేశారు. అయితే చట్టాన్ని పూర్తిగా ఎత్తేస్తే ఏడుస్తారని ఇలా నీరుగార్చారంతే! ఈ దేశంలో ప్రజలు మెజారిటీ. ఉద్యోగులు మైనారిటీ. మెజారిటీ వర్గీయులు మైనారిటీలను కేసులతో వేధించడం సబబు కాదన్న సహజ న్యాయ సూత్రమూ సంతృప్తి చెందడంతో విపక్షాలూ సరేనన్నాయి. సమాన శిక్ష సూత్రం కారణంగా... ఫిర్యాదీదారులుగా ఉండే ప్రభువులైన ప్రజలతో, సేవకులైన ఉద్యోగులకూ సమాన హోదా దక్కి ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లింది. 'తినడం' అన్న సంగతే బయటపడదు కనుక... 'న ఖావుంగా.. న ఖానే దూంగా' అనే మోదీ గారి ప్రతిజ్ఞ కూడా నెరవేరినట్టైంది! ఇక మనం నీతిమంతమైన అగ్రదేశంగా చెప్పుకోవచ్చు. జయహో భారత్!!

చివరాఖరు: తెలంగాణ ఏర్పడిన కొత్తలో... హైదరాబాద్ శివార్లలో కొంతమంది అక్రమంగా బోర్లు వేసి నీళ్ల వ్యాపారం చేసేవారు. నిప్పులాంటి డిప్యూటీ కలెక్టర్ ఒకరు ఆ దందాను అడ్డంగా అడ్డుకున్నారు. బోర్ల యజమానులంతా బోరుమంటూ ఓ కీలక మంత్రిని సంప్రదించారు. ఆయన ఆ అధికారికి ఫోన్ చేసి... 'చూసీ చూడనట్టు పోండి' అంటూ సలహా ఇచ్చారు. "తెచ్చుకున్న తెలంగాణకు అవమానం కలిగించే పనులు మీరు చేయకండి. నాతో చేయించకండి" అని ఆ అధికారి మంత్రి మొహం మీదే సూటిగా చెప్పేశారు. దీంతో ప్రభుత్వంలో ఆయన ఫిట్ కాడని భావించి.. ఓ 'ప్యాలెస్ విధుల్లో' బంధించి ఊపిరి పీల్చుకున్నారు. ఇదండీ దేశంలో నిజాయతీపరులకున్న విలువ!

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ✧

# దొంగల జోడీ... సంపద దోపిడీ

- దిలీప్ రెడ్డి

ఓ పోలీసు ఉన్నతాధికారిని పట్టపగలు హతమార్చిన హంతకునితో జతకట్టి, అవినీతి పునాదులపై పోలీసులే నేరసామ్రాజ్యాన్ని నిర్మిస్తారు. ఏజెన్సీ ప్రాంతంలో సేవలందిస్తున్న ఓ యువ ఐపీఎస్ అధికారి అర్థంకాని ఒత్తిళ్ల మధ్య నలిగి అకస్మాత్తుగా ఆత్మహత్య చేసుకుంటే.. కాలం గడుస్తున్నా కారణాలు తెలియవు. పోలీసు పెద్దల పురమాయింపులు, వసూళ్ల ఒత్తిళ్లు భరించలేక దేశ సైనికుడిగా సేవలందించి వచ్చిన ఓ యువ ఎస్సై సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకు చస్తాడు. ఇవి మన ఆంతరంగిక భద్రతా విభాగంలో వెలుగుజూస్తున్న పరిణామాలు. కొత్త సినిమా కథలా వున్నా ఇవి కఠోర వాస్తవాలు. ప్రజాస్వామ్యం ముసుగులో సామాన్యునికి తగిలే ఈ దెబ్బల బాధితులే తప్ప బాధ్యులుండరు. నీతికీ, నియమాలకూ నీళ్లదిలి అడ్డదారులు తొక్కేవారికి సంపదే తప్ప సమస్యలుండవు. దుర్ఘటనల జనాసక్తికర కథనాలే తప్ప అధికార వ్యవస్థ జవాబుదారీతనం సున్నా! ఎందుకిలా జరుగుతోంది? ఒక్కమాటలో చెప్పలేం. చాలాకాలంగా పోలీసు తదితర కీలక ప్రభుత్వ శాఖల్లో, దారితప్పిన రాజకీయ మంత్రాంగంతో జోడీకట్టే అధికార యంత్రాంగం పుణ్యమాని ప్రభుత్వ వ్యవస్థలన్నిటా బలపడుతున్న అవినీతి విశృంఖలతకు ఇవి మచ్చుతునకలు. ఇంకా లోతుల్లోకి వెళితే గగుర్పాటు కలిగించే అరాచకాలు, అన్యాయాలు యధేచ్ఛగా సాగుతుంటాయి. ఆశ్చర్యం కలిగించే వింత కథనాలూ ఉంటాయి. పాలనావ్యవస్థల్ని కేన్సర్‌లా కమ్ముకుంటున్న అవినీతి సగటు మనిషి జీవితపు ప్రతి పార్శ్వాన్నీ తాకుతోంది. మనిషి నిత్యజీవితంతో విడదీయరాని బంధమున్న పలు కీలక విభాగాల్లో లంచాల 'సరఫరా గొలుసులు' ఉన్నాయి. అట్టడుగు స్థాయిలో ఎవరో వసూళ్లు చేస్తారు. పై మెట్లలోని అధికారులకి లెక్కల ప్రకారం వాటాలందుతాయి. ఈ శృంఖలంలో ఇమిడితే సరేసరి, లేదంటే స్వయంగా తప్పుకోవాలి లేదా తప్పిస్తారు. రెండూ జరక్కపోతే ఓ శశికుమార్‌లాగో, ఓ ఆర్కేరెడ్డిలాగో హతమైపోయే పరిస్థితులు కల్పిస్తారు. చిన్నప్పట్నుంచి ఎంతో శ్రమించి, ఎన్నో ఆశయాలతో వచ్చినవారు కూడా వ్యవస్థీకృతమైన 'అవినీతి' చేతిలో ఓడిపోతున్నారు. అర్థంతరంగా బతుకు చాలిస్తున్నారు. వారిని కాపాడుకోవాల్సిన అవసరముంది. దీనిపై విస్తృత స్థాయిలో చర్చ జరగాలి. పౌరసమాజంలో ఇంకా చలనం రావట్లేదు. ఆసక్తికర కథనాల్ని వింటూ, నెమరేస్తారు, ముచ్చటిస్తారు.. ఒకటి రెండు రోజులాగి మరో కథ!

### అపవిత్ర కలయికే అసలు కారణం

రాజకీయ అవినీతి, అధికారుల అవినీతి మన వ్యవస్థను ప్రధానంగా పట్టి పీడిస్తున్నాయి. విధాన నిర్ణయాలు, అమలు, ప్రాజెక్టులు, అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలకు సంబంధించి అత్యున్నత స్థాయిలోనే రాజకీయ యంత్రాంగం అవినీతికి పాల్పడటం తరచూ వివాదాస్పదమౌతోంది. తమ అధికారాన్ని నిరంతరం కొనసాగించడానికి, ఆధిపత్యం చెలాయించడానికి కార్యనిర్వాహక వ్యవస్థను గుప్పిట్లో ఉంచుకునే క్రమంలో వారు అధికారులకు అనుచిత ప్రయోజనాలు కల్పిస్తూ అవినీతిపరులను చేసే సందర్భాలూ ఉంటాయి. చట్టాల్లో లసుగుల్ని చూపిస్తూ, తప్పుల్ని మరుగుపరుస్తూ.. రకరకాలుగా రాజకీయ నేతలకు అవినీతి అధికారులు దన్నుగా ఉంటారు. వారి ఇష్టానుసారం బదిలీలు, పోస్టింగులు, కేసులు ఎత్తివేత, మినహాయింపులు ఇప్పిస్తూ నేతలు వారికి అండగా నిలుస్తారు. అటు నేతలు, ఇటు అధికారులు పరస్పరం ప్రయోజనం పొందుతూ చేస్తున్న నిర్వాకాలతో అవినీతి తారాస్థాయికి చేరుతోంది. రాజకీయ అవినీతి వల్ల పోగయ్యే డబ్బులో కొంతయినా ఎన్నికలప్పుడు తిరిగి ప్రజాబాహుళ్యంలోకి వస్తోంది, ప్రతి అయిదేళ్లకోసారి ఎన్నికల రూపంలో వారు ప్రజాతనిఖీకి వెళ్తుంటారు. కానీ, అధికారులు అవినీతికి అలవాటు పడితే.. బదిలీలు, తాత్కాలిక సస్పెన్షన్లు వంటి చిన్న చిన్న శిక్షలుంటాయేమో తప్ప పదవీవిరమణ వరకు వారి దురాగతాలకు అడ్డు అదుపూ ఉండదని విశ్లేషకులు చెబుతుంటారు. లంచాలు తీసుకుంటూ ఏసీబీ కేసుల్లో ఇరుక్కున్న అధికారులు సైతం.. తదనంతర దశల్లో ఉన్నతాధికారులకో, నేతలకో పెద్ద మొత్తాల్లో లంచాలిచ్చి సదరు కేసులను ఉపసంహరింపచేసుకుంటున్న ఉదంతాలూ ఉన్నాయి. రూ. 20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి, సదరు కేసు విరమింప చేసుకోవడానికిచ్చే రెండు, మూడు లక్షల్లో

కొంతవాటా సహకరించిన మంత్రికీ వెళుతుందని ఉద్యోగులే అంటున్న మాట.

## సహజ సంపద కొల్లగొడుతున్న తోడుదొంగలు

రాజకీయ, అధికార వ్యవస్థలు కూడబలుక్కుని జరిపే సహజ వనరుల దోపిడీ మరింత ప్రమాదకరమైంది. భవిష్యత్తు తరాలకు శాపంగా పరిణమిస్తున్న వీరి జమిలి నిర్వాకాల్లో ఎర్ర చందనం, ఇసుక, ఇతర ఖనిజ సంపద దోపిడీ అత్యంత ప్రమాదకరమైంది. ప్రకృతి భవిష్యత్తునే వీరు పణంగా పెడుతున్నారు. దానికి తోడు, ప్రాజెక్టుల్లో వాటాలు, అక్రమ నిర్మాణాలు, దొంగ సరకు రవాణాలు, కల్తీలు, ప్రజా పంపిణీ సరుకుల దారి మళ్లింపులను ప్రోత్సహించడం వంటివి వారికి ఇబ్బడిముబ్బడిగా రాబడి తెచ్చిపెడుతుండటంతో ఈ అపవిత్ర కలయిక మరింత బలపడింది. ఆశయాలు, లక్ష్యాలతో పనిచేయాలనుకునే యువ ఉద్యోగులకు స్థానం లేకుండా చేస్తున్నారు. కాలక్రమంలో వారిని తమలో కలిపేసుకుని అవినీతిపరుల్నయినా చేస్తారు, లేదంటే ప్రాధాన్యత లేని స్థానాల్లోకయినా బదిలీ చేయిస్తారు. ఇదేదీ కుదరకపోతే, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒత్తిళ్లు పెంచి ఉద్యోగంలోంచో, కడకు జీవితాల్లోంచో వైదొలగే పరిస్థితులు కల్పించి తమ అడ్డు తొలగించుకుంటారు. ప్రజలు కష్టపడి కూడబెట్టుకున్న సొమ్మును, పౌరుల ఉమ్మడి సహజ వనరుల్ని ఈ అవినీతిపరులు దోచేస్తున్నారు. ఇసుక అక్రమ తరలింపుదారుల నుంచి రెవిన్యూ, పోలీసు, రవాణా శాఖల అధికారులు పెద్దమొత్తాల్లో మామూళ్లు వసూలు చేస్తున్నారనడానికి గజ్వేల్ ఉదంతమే నిలువెత్తు నిదర్శనం. పోలీసు శాఖలో కింది ఉద్యోగుల పనితీరు గురించి వారి పై అధికారులిచ్చే వార్షిక రహస్య నివేదిక (ఏసీఆర్)లే కీలకమైనవి. చెప్పింది వినకుంటే ఏం రాస్తారో? అనే భయం, నోరు విప్పితే 'యూనిఫాం సర్వీసు' ఉద్యోగులుగా క్రమశిక్షణా చర్యలకు గురికావాల్సి వస్తుందనే భయం.

## తగు శిక్షలు లేకే తప్పులు పునరావృతం

అవినీతి అధికారుల్ని శిక్షించే వ్యవస్థలు సరిగా లేవు. లోకాయుక్త, ఏసీబీ, విజిలెన్స్, మానవ హక్కుల సంఘం వంటివి ఆచరణలో ఎంతో బలహీనంగా ఉండటం అవినీతి అధికారులకీ ఆటవిడుపుగా మారింది. ఎవరికీ పెద్దగా శిక్షలు పడటం లేదు. అందుకే బలమైన లోక్‌పాల్ వ్యవస్థను పౌరసమాజం కోరుకుంది. 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' పౌర సంస్థ ఆధ్వర్యంలో 2016లో మలేషియాలో సమావేశమైన 16వ 'అవినీతి వ్యతిరేక అంతర్జాతీయ సదస్సు' భారత్‌లో పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేసింది. అవినీతి వ్యతిరేక విధానాలు, సంప్రదాయాలు, పద్ధతులు కాగితాల్లోనే తప్ప ఆచరణలో ఉండవని పేర్కొంది. కొన్నాళ్ల క్రితం జరిగిన మెదక్ జిల్లా కుకునూర్‌పల్లి ఘటనలో.. ఎస్సై రామకృష్ణారెడ్డి సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని చనిపోతూ ఏ పోలీసు అధికారిపై ఫిర్యాదు చేశాడో ఆయనే ఆ కేసు ఎఫ్ఐఆర్ తయారు చేశారు. ఇదీ, మన దగ్గర జరిగే ధృతరాష్ట్ర నీతి! చనిపోవడానికి ముందు.. పై అధికారుల ఒత్తిళ్లు తట్టుకోలేకపోతున్నాను, వారు నిర్దేశించిన 'వసూళ్లు' తన వల్ల కావట్లేదు, అందుకే చనిపోతున్నానని రాసిపెట్టి మరీ పోయాడు. ఒక ఎస్సై లంచాల వసూళ్ల గొలుసులో ఇమడలేక బలైపోవడం వల్ల బయటపడ్డ వ్యవహారం ఇది. అంతర్గతంగా ఇలాంటి 'వసూళ్లు–ఒత్తిళ్లు' చాలా చోట్ల జరుగుతున్నవే! పోలీసుతో పాటు రెవిన్యూ, ఎక్సైజ్, పౌర సరఫరాలు, స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, మున్సిపల్, వాణిజ్యపన్నులు.. ఇలా చాలా విభాగాల్లో లంచాల వ్యవహారం బహిరంగ రహస్యమే. 'ఈ దందాకు ఇంత' అని జులుం చేసి మరీ లంచాలు గుంజుతారు. అధికారి స్థాయిని బట్టి ఎవరి వాటాలు వారికందుతాయనీ చెబుతారు.

తప్పుడు రాజకీయ నాయకులు, దారి తప్పిన అధికారులు చేతులు కలిపిన చోట అన్ని స్థాయిల్లో అవినీతి రాజ్యమేలుతోంది. వారి ఆగడాలకు అంతుండటం లేదు. ఒకప్పుడు లంచాలంటే.. నిబంధనలకు విరుద్ధంగా, తప్పుడు పద్ధతిలో పనిచేయించుకోవడానికి కొంత సొమ్మును చాటుమాటుగా 'వసూల్ రాజా'లకు చెల్లించేవారు. కానీ, ఇప్పటి పద్ధతి వేరు. చట్టానికి లోబడి, నిబంధనల ప్రకారం జరగాల్సిన పనులు కూడా అధికారుల, వారి ఏజెంట్ల చేయి తడపకుండా, పర్సంటేజీలు చెల్లించకుండా జరగవు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఇంతే అని కాదు. మంచివారు, నిజాయతీపరులూ ఉంటారు. కాకపోతే, ఈ మంచి–చెడుల శాతాలు తిరగబడుతున్నాయి. ఉద్యోగులలోనే నైతికవిలువలు లోపించడం, అవినీతికి అడ్డూఅదుపూ లేకపోవడం, తప్పులు తేటతెల్లమైనా తగుచర్యలు లేకపోవడం, ప్రభుత్వాలు 'ఉద్యోగులతో స్నేహపూర్వక వైఖరి', దాన్ని సానుకూలంగా మలచుకుని కొల్లగొట్టే అవినీతి అధికారుల తత్వం.. ఇలాంటివన్నీ అందుకు కారణమవుతున్నాయి.

*(కర్టెసీ: సాక్షి)* ✧

# పటిష్ట చట్టమే అవినీతికి పగ్గం

- కూసంపూడి శ్రీనివాస్




అవినీతిపై మన మతిమరుపు రాజకీయ నాయకులకు పెద్ద అవకాశం. మన మేలు కోసమే మానసిక వ్యాయామం చేస్తున్నామనుకుని.. ఆ మతిమరుపును గనక కాస్త పనిగట్టుకుని వదిలించుకుంటే– ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని రెండు పెద్ద భూకుంభకోణాలు గుర్తుకొస్తాయి.

కొద్దికాలం క్రితం అవి మనల్ని ఉలిక్కిపడేలా చేశాయి. ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు కలసికట్టుగా చేసిన ఆ దోపిడీలో విస్తుబోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఒకటి విశాఖ జిల్లాలో జరగ్గా, రెండోది హైదరాబాద్ కూకట్‌పల్లి కేంద్రంగా జరిగింది.

విశాఖ కలెక్టర్ వెల్లడించిన లెక్కల ప్రకారమే రూ.25వేల కోట్ల విలువైన వేల ఎకరాలకు సంబంధించిన రికార్డులు జిల్లాలో తారుమారయ్యాయి. హుద్‌హుద్ తుఫాను సమయంలో రికార్డులు పోయినట్టు ఏనాడూ చెప్పని రెవెన్యూ అధికారులు మూడేళ్ల తర్వాత అకస్మాత్తుగా ఆ ప్రకృతి విపత్తును సాకుగా చూపి రికార్డుల గోల్‌మాల్ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించారు. తర్వాత దాని మీద ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) వేశారు. ఆ నివేదిక సిద్ధమైనా ముఖ్యమంత్రి తొక్కిపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పర్యటించి లోక్‌సత్తా కూడా భూ కుంభకోణం వివరాల్ని బహిరంగపరిచింది. సిట్ నివేదికను బైటపెట్టాలని లోక్‌సత్తాతోపాటు ఇతర పార్టీలూ, సంఘాలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం ఎన్నికల రాజకీయ అవసరాల కోసం తాత్సారం చేస్తోంది. అదేవిధంగా ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని తమకు అనువుగా మార్చుకుని హైదరాబాద్ కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వేదికగా చేసుకుని రూ.15వేల కోట్ల విలువైన సుమారు 816.04 ఎకరాలను కొల్లగొట్టే ప్రయత్నం చేసిన కుంభకోణంలో.. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ అధికారులతో రియల్టర్లు, రాజకీయ అక్రమార్కులు కుమ్మక్కయినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అయినా తిమింగలాల్ని ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు. నయీం కేసులలోలాగే అంతా ఛూమంతర్.

అవినీతి అధికారుల ఇళ్లపై రెండు రాష్ట్రాల్లో జరిపిన ఏసీబీ దాడుల్లో కోట్ల కొలదీ ఆస్తులు బయటపడుతున్నాయి. చేతులు తడపనిదే ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు, కొత్త స్తంభాలు, కనెక్షన్ల ఏర్పాటు ఏదీ ముందుకు కదలటం లేదని, ఈ అవినీతిని ఆపడం సాధ్యంకావడం లేదని స్వయానా ఎస్పీడీసీఎల్ సీఎండీ (రఘుమారెడ్డి) వాపోయారంటే పరిస్థితి తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా కూడా ఏదో మూలన అవినీతి కుంభకోణాలు బయటపడుతూనే ఉన్నాయి. మోదీ వచ్చాక ప్రభుత్వ పనులకు లంచాలు పెరిగాయనే విశ్లేషణలు కూడా వినిపిస్తున్నాయి. ఉప ఎన్నికల్లో, ఇటీవలి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఖర్చుని కూడా పరిగణలోకి తీసుకుంటే.. డీమానిటైజేషన్ తరువాత అవినీతి కొత్తరూపాల్ని సంతరించుకుంటోందే తప్ప ప్రధాని మోదీ చెప్పినట్టు తగ్గలేదని ఢంకా బజాయించి చెప్పేయొచ్చు.

దేశంలో అవినీతి, ప్రభుత్వం కవల పిల్లల్లాంటివిగా మారిపోయాయి. ఈ రెంటినీ వేరుచేసి చూడలేం. ఎన్ని అవినీతి నిరోధక చట్టాలున్నా లసుగులతో అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. దీంతో అవినీతి, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం పెనవేసుకు పోయాయి. సమాజంలో అవినీతి విస్తరిస్తున్న తీరును గమనిస్తే సమష్టి ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడాల్సిన సహజ వనరులను కొద్దిమంది హస్తగతం చేసుకుంటున్నారు. ఆ ఆస్తిని, అధికారాన్ని కాపాడుకోవడం కోసం పాలకులు అవినీతిని ప్రోత్సహిస్తున్నారు. ఇది ఎంతవరకు వెళ్లిందంటే, ప్రభుత్వ ప్రమేయం విస్తరించినంత మేర దీని ప్రభావం కనిపిస్తుంటుంది. లంచం, రాజకీయ ప్రమేయం అన్నిచోట్లా మామూలైపోయాయి. బర్త్ సర్టిఫికెట్ మొదలుకుని ఏ చిన్న పనికావాలన్నా లంచం ఇవ్వకుండా పని అవ్వని స్థితికి పాలకులు అధికార యంత్రాంగాన్ని నెట్టివేశారు. ప్రభుత్వంలో

అధికారం, ఉద్యోగంలో హోదా అంతా వ్యక్తులకు సొంత ఆస్తిగా మారిపోయింది. తమ పదవిని అడ్డంపెట్టుకుని అడ్డదారులు తొక్కి, అధికారాన్ని దుర్వినియోగపరిచి కేవలం సొంత లాభం చేసుకోవడమే పరమావధిగా ప్రభుత్వ వ్యవస్థ మారిపోయింది. అయినకాడికి లంచాలు మేయడం, తమకు కావాల్సిన అవినీతిపరుల్ని అందలాలెక్కించడం, వాళ్ల ద్వారా ప్రజాధనాన్ని దోచుకోవడం, సామాన్యులను నిలువుదోపిడీ చేయడం అధికారంలో భాగమైపోయాయి. దేశవ్యాప్తంగా అవినీతిలో కూరుకుపోయిన పాలకులు, ప్రభుత్వోద్యోగుల పట్ల ప్రజలలో రోజురోజుకీ విశ్వాసం సన్నగిల్లుతోంది. ఒకపక్క మన రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు అక్రమ సంపాదనతో ప్రపంచంలోని ధనవంతులతో పోటీపడుతుంటే, మరోపక్క రైతుల ఆత్మహత్యలు, ఆకలిచావులు కొనసాగుతున్నాయి. ఒకపక్క విదేశీబ్యాంకుల్లో అవినీతి సొమ్ము మూలుగుతుంటే, మరోపక్క ప్రజలు కొనుగోలు శక్తిలేక పౌష్టికాహారలేమిని ఎదుర్కొంటున్నారు.

తాజాగా - అవినీతి నిరోధక చట్టం 1988కి బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మతిలేని సవరణలు లంచగొండి అధికారులకు వరంగా మారాయి. ఈ బిల్లులో కేంద్రం అధికారికంగా ఆమోదించిన 17 'ఎ' నిబంధన వల్ల అవినీతి ఆరోపణలు వచ్చిన ప్రభుత్వోద్యోగి మీద ముందస్తు అనుమతి లేకుండా, కనీసం కానిస్టేబుల్ కూడా దర్యాప్తు చేసే అవకాశముండదు. ఇది ఒకరకంగా అవినీతి నిరోధక వ్యవస్థ, చట్టాలను స్తంభింపచేయడమే. అదేవిధంగా అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లులోని సెక్షన్ 8 ప్రకారం లంచం ఇవ్వచూపడం నేరపూరిత చర్య. ప్రభుత్వాధికారులు వారి విధులు నిర్వర్తించడానికి లంచం ఇవ్వచూపడం, ఇస్తానన్న వాగ్దానం చేయడం లేదా ఇవ్వడాన్ని విచారణకు అర్హమైన నేరంగా పరిగణిస్తారు. లంచం ఇచ్చేవారికి రక్షణ కల్పించేందుకు సెక్షన్ 8లోని సబ్‌సెక్షన్‌ని ప్రతిపాదించారు. లంచం ఇచ్చేవారు ముందుగా చట్టానికి తెలియచేయడం, దర్యాప్తు సంస్థకు ఉప్పందించడం వల్ల మాత్రమే వారికి ఈ రక్షణ లభిస్తుంది. కానీ రోజువారీ సేవల కోసం సాధారణ పౌరులు బలవంతంగా, గత్యంతరం లేక ఇచ్చే లంచాల నుంచి రక్షణను మాత్రం ఈ సవరణలు పట్టించుకోలేదు. లంచం ఇచ్చే పౌరుడు/పౌరురాలు వారం రోజులు ముందుగనక పోలీసుకి లేదా చట్టబద్ధ సంస్థకి సమాచారం ఇస్తేనే రక్షణ కల్పించాలని కమిటీ సిఫార్సు చేయడం ఎంత అవాస్తవికంగా ఉంది!? అవినీతిపూరితమైన వ్యవస్థలో పౌరులు ఇలా స్పందించగలుతారనుకోవడం భ్రమ మాత్రమే.

అయితే.. లంచం ఇచ్చే వారిలో ఇంకొక తరగతి వారు కూడా ఉన్నారు. వారి వల్ల ప్రజాశ్రేయస్సు దెబ్బతినడమే కాకుండా, అవినీతితో ప్రభుత్వోద్యోగులు కూడా భారీగా ఆర్జిస్తుంటారు. ఒప్పందాలు, సహజ వనరుల కేటాయింపు, లైసెన్సులు, నియామకాలు, అధికారుల బదిలీల మంజూరు, సాక్ష్యాల్ని సమకూర్చడం, ప్రాసిక్యూషన్‌ను అనుచితంగా ప్రభావితం చేయడం, ప్రజలకు అందాల్సిన సేవల నాణ్యతను దెబ్బతీయడం, సాధారణ పాలన గాడితప్పేలా చేయడం వంటి వాటి కోసం లంచాలిచ్చే వారుంటారు. ఇలాంటి లాలూచీ లంచాలిచ్చేవారిని మాత్రం కఠినంగా శిక్షించడం అవసరం. ఇప్పుడున్న చట్టాలు, తాజా చట్ట సవరణలు అందుకు అనుగుణంగా లేకపోగా విరుద్ధంగా ఉన్నాయి.

తమకు హక్కుగా అందాల్సిన సేవల కోసం గతిలేక బలవంతంగా లంచాలిచ్చే సామాన్య పౌరులకు కూడా జైలు శిక్షను ఈ సవరణల్లో తప్పనిసరి చేశారు. మరోవైపు, లంచం తీసుకునేవారిపై పైనుంచి కిందిస్థాయి వరకు కనీసం పోలీసు దర్యాప్తు చేయాలన్నా ముందస్తు అనుమతి కావాలన్నారు. బాధిత ప్రజలకు శిక్ష.. లంచగొండులకు రక్ష అన్న ఈ సవరణల్ని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై లోక్‌సత్తా జేపీ ఎప్పటి నుంచో చేస్తున్న హెచ్చరికల్ని ప్రధాన పార్టీలు పట్టించుకోకపోవటం జాతి దురదృష్టకరం.

దానితోపాటు లోక్‌సత్తా సూచిస్తున్నట్టు.. తీవ్ర అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారుల్లో కనీసం ఓ 1000మందిని తప్పనిసరి రిటైర్‌మెంట్‌తో ఇంటికి పంపించాలి. స్మగ్లింగ్, విదేశీ మారకద్రవ్య అక్రమాలకు పాల్పడేవారిని కట్టడిచేయడానికి 1976లో రూపొందించిన 'సఫెమ' (ఎస్ఏఎఫ్ఈఎంఏ) తరహాలో అవినీతిని నిరోధించడానికి చట్టం తీసుకురావాలి. ఈ చట్టంలో ఇటువంటి కీలక మార్పులు ఉండాలి. బినామీ ఆస్తులు సహా మొత్తం ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం, 15 ఏళ్లు లేదా ఇంకా ఎక్కువ జైలు తప్పనిసరి చేయడం, ప్రాథమిక సాక్ష్యం ఉంటే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యతను నిందితుని మీదకే మళ్లించడం లాంటి ప్రభుత్వం వెంటనే చేపట్టాలి. ప్రజలకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన సేవలను అందించడం, ఆలస్యమైతే పరిహారం చెల్లించడం కోసం 'పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ/ రైట్ టూ సర్వీసెస్/ఆర్‌టీఎస్) చట్టాన్ని అమలు చేయాలి.

అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లులోని లోపాల్ని తొలగించి పౌర సేవల చట్టాన్ని తీసుకురావాలని పార్టీలకతీతంగా అందరూ మన పార్లమెంటు సభ్యుల్ని డిమాండ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ✧

# అవినీతి భల్లూకం పట్టులో...

-బాలు

ఠంచనుగా వేళకు హాజరై, నియమానుసారం కర్తవ్య నిర్వహణకు నిబద్ధమై, బుద్ధిగా తలంచుకొని సిబ్బంది ఎవరికి వారు సక్రమంగా విధులు నిర్వర్తిస్తుంటే అది, పవిత్ర భారతదేశంలో సగటు సర్కారీ కార్యాలయం ఎందుకవుతుంది? అవసరార్థులై వచ్చినవాళ్లను పదేపదే చుట్టూ తిప్పించుకోవాలి. ఫైలుకిదీ రేటు, పనికింత ఫీజు అని తత్వం తలకెక్కేలా బోధపరచి నిక్కచ్చిగా ముక్కు పిండి పనులు చేయాలి. లంచాలు దండుకోవడంలో, యథాశక్తి మామూళ్లు పిండుకోవడంలో ఏ మాత్రం వెనకంజ వేసినా– ఆసియా ఖండంలో అత్యంత అవినీతిమయ దేశమన్న భారత్ రికార్డుకు ఎక్కడ ముప్పొచ్చిపడుతుందోనన్న వెరపుతో దేశంలో లంచావతారుల వీర విజృంభణ హోరెత్తిస్తోంది. జనజీవన అవసరాలతో నేరుగా ముడివడిన ప్రభుత్వ కార్యాలయాలన్నీ తరతమ భేదాలతో అవినీతిని శ్వాసిస్తూ నిత్య లంచం పచ్చతోరణంగా వర్ధిల్లుతున్నాయి. ఆమ్యామ్యాలు సమర్పించుకోలేనివాళ్ల బతుకుల్ని నరకప్రాయం చేస్తూ పౌరసేవల స్వరూప స్వభావాలనే మార్చేస్తున్నాయి. మీరే చూడండి... భూదస్త్రాల ప్రక్షాళనతో తినమరిగినవాళ్ల అడ్డగోలు చేతివాటమే అందుకు తాజా దృష్టాంతం.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూదస్త్రాల నవీకరణ, కొత్త పట్టా పాస్‌పుస్తకాల పంపిణీల పుణ్యమా అని క్షేత్రస్థాయి సిబ్బంది సందడిగా పండగ చేసుకుంటున్నారు. ప్రాంతాలవారీగా భూముల ధరవరల్లో హెచ్చుతగ్గుల ప్రాతిపదికన ఒక్కో పాస్ పుస్తకానికీ రెండు వేల నుంచి పదిహేను వేల రూపాయల వరకు మామూళ్లు జుర్రుకుంటున్నారు. వారసత్వ బదిలీ, మ్యుటేషన్, భాగపంపిణీ తదితరాల్లో అక్రమాలకు ఆస్కారం ఉన్నచోటల్లా వసూళ్ల దందా పెచ్చరిల్లుతోంది. కొంతమంది గ్రామ రెవెన్యూ అధికారులు, తహసీల్దారుల లీలలు రచ్చకెక్కిన దృష్ట్యా, గుట్టుచప్పుడు కాకుండా పని చక్కబెట్టేసే బాగోతాలకు పట్టపగ్గాల్లేకుండా పోయాయి. కొన్ని నామధేయాలే వెల్లడవుతున్నాయంటే అర్థం– తక్కిన మరెందరో సకలవిధ జాగ్రత్తలూ తీసుకుంటున్నారని! తెలుగు గడ్డపైన పట్టాదారు పాస్ పుస్తకాలనేముంది– పహాణీల జారీ, బిల్డింగ్ ప్లాన్ల మంజూరు, విద్యుత్ మీటర్ల ఏర్పాటు, సర్వీస్ కనెక్షన్ల జారీ... దాదాపు పౌరసేవలన్నీ లంచాల లోగిళ్లుగా భ్రష్టుపడుతున్నా ముసుగులు తొలగుతున్నవాళ్ల సంఖ్య పరిమితంగానే ఉంటోంది. సర్కారీ కొలువంటేనే చేతనైనంత దోచుకోవడానికి జీవితకాల లైసెన్సుగా చలామణి అవుతున్న రోజుల్లో మౌలిక నిర్వచనాలకు అనుబంధ సూత్రాలు పుట్టుకొస్తున్నాయి. 'ప్రజల వలన ప్రజల చేత ప్రజల కొరకు'గా అభివర్ణించేది ప్రజాస్వామ్యం. 'అధికారుల వలన దళారుల చేత లంచగొండుల కొరకు'గా వర్ధిల్లుతున్నది లంచాలస్వామ్యం!

మొన్నీమధ్యే దేశంలోని పదమూడు రాష్ట్రాల్లో విస్తృత అధ్యయనమొకటి నిర్వహించారు. లంచాలు మేపితేనే తప్ప రకరకాల ప్రభుత్వ సేవలు దక్కడం లేదని, అందులో పాల్గొన్న 27 శాతం కుటుంబాలు గగ్గోలు పెట్టాయి. నోరు విప్పని బాధితులెందరో ఎవరు లెక్కించగలరు? ప్రతి పదిమంది భారతీయుల్లో ఏడుగురు అవినీతి బాధితులేనని 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' సంస్థ మదింపు వేసింది. పోలీస్ ఠాణాలు, దర్యాప్తు సంస్థలు, భూ లావాదేవీలు సహా పదకొండు రకాల సేవల్లో అవినీతి పద్దుకింద దేశంలో ఏటా మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా జమపడుతోందని అది లెక్కకట్టింది. విభాగాలవారీగా లంచాలమేత చురుగ్గా ఉన్న తొలి నాలుగింటా ఉభయ తెలుగు రాష్ట్రాలూ కొలువుతీరగా– లంచాల మేతలో ప్రథమ ర్యాంకు తమిళనాడుకు దఖలుపడింది.

'కొన్ని శాఖలు రెండంకెల అభివృద్ధిని నమోదు చేస్తున్నాయి... రెవెన్యూ విభాగంలోనేమో అవినీతి రెండంకెల్లో నెలకొంది' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ మధ్య వాపోయారు. 'అవినీతిరహిత పాలన అందిస్తా'మని తనవంతుగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పట్లోనే ప్రకటించారు. రెండేళ్లు గడిచాక– ఏపీలో అవినీతి పెరిగిందని 72 శాతం పౌరులు

మొత్తుకుంటున్నారు. తెలంగాణలో అంతే శాతం ప్రజలు తాము అవినీతి బాధితులమని వెల్లడించారు. అడపాదడపా ఏసీబీ (అవినీతి నిరోధక విభాగం) దాడుల్లో దొరుకుతున్న చిన్నచేపల వద్దే కోట్ల రూపాయల ఆస్తిపాస్తులు వెలుగు చూస్తుండటం- లంచాలమేత ఎంత భారీ పరిశ్రమగా విస్తరించి స్థిరపడిందో సోదాహరణంగా తెలియజెబుతోంది.

వసూల్ రాజాల శక్తిసామర్థ్యాలను ఇదమిత్థంగా నిర్ధారించగల సరైన కొలమానాలేమీ లేవు. పింఛన్లు, ఉపకార వేతనాలు, భూ సమస్యలతోపాటు కడకు శవపరీక్షల దగ్గరా మామూళ్లు చేతిలో పడనిదే ఎదుటివాళ్లను కదలనివ్వని రాక్షసత్వాన్ని కిలోల్లో టన్నుల్లో తూచగలమా?

పదేళ్ల క్రితమే ఒక హెడ్‌కానిస్టేబుల్ ఆస్తుల చిట్టాలో- నాలుగు ఇళ్లు, పందొమ్మిది ఇళ్లస్థలాలు, దాదాపు పాతిక ఎకరాల భూమి, అరకోటి విలువ చేసే తాకట్టు పత్రాలు బయటపడటం కరీంనగర్ జిల్లాలో గగ్గోలు పుట్టించింది. లంచాల సొమ్ము పంచుకోవడంలో వాటాలు తేలక ఇటీవల అమరావతి పంచాయతీ కమిషనరేట్‌లోని ఇద్దరు అధికారులు తమ కార్యాలయ ఆవరణలోనే బాహాబాహీకి తెగబడటం తీవ్ర కలకలం రేకెత్తించింది. 'చిన్నవాళ్లం... మా దగ్గరేముంటాయి సార్?' అని బీద అరుపులు అరిచే దిగువస్థాయి ఉద్యోగుల ఇళ్లలోనూ బయటపడుతున్న నగలు, నగదు, ఆస్తిపత్రాల వివరాలు విశ్వరూపం దాల్చిన అవినీతి వాటావరణానికి మచ్చుతునకలు!

దాడుల్లో పట్టుబడినా, కేసులు పెట్టినా హడలెత్తిపోయే అర్భకులెవరూ లేరిక్కడ. దేశంలో నమోదవుతున్న ప్రతి వంద అవినీతి కేసులలో కేవలం 19 మాత్రమే శిక్షల ఖరారుకు నోచుకుంటున్నాయి. పదిహేనేళ్ల గణాంకాల విశ్లేషణ చాటుతున్న కఠోర యథార్థమిది. కాలం కలిసిరాక పట్టుబడినవాళ్లలో 80 శాతానికిపైగా ఎటువంటి ఏ శిక్షా పడకుండా దర్జాగా తప్పించుకుంటున్నారన్న మాట. కూపీ లాగుతున్నారనో, నిఘా పెట్టారనో ఉప్పందగానే ఎక్కడికక్కడ బేరాలు, ప్రలోభాలు, సర్దుబాట్లతో జాగ్రత్తపడుతున్న అక్రమార్కులు మరెందరో ఎన్నడూ కచ్చితంగా వెల్లడయ్యే అవకాశమే లేదు.

'భరత ఖండంబు చక్కని పాడియావు... తెల్లవారను గడుసరి గొల్లవారు పిదుకుచున్నారు మూతుల బిగియకట్టి' అంటూ అలనాటి పరాయి పాలకుల దుర్మార్గాల్ని దౌర్జన్యాల్ని చిలకమర్తి లక్ష్మీనరసింహ కవి అక్షరీకరించారు. కొన్నేళ్లుగా దేశపౌరుల పెడరెక్కలు విరిచికట్టి సర్కారీ కొలువే ఆసరాగా లంచావతారులూ అలాగే దోచుకుంటున్నారు. వాళ్లలో బెదురు పుట్టించే దారేమిటో 'నీతిఆయోగ్' సూచించింది. విజిలెన్స్ కేసుల విచారణ పూర్తి కావడానికి సగటున ఎనిమిదేళ్లు పట్టడం మూలాన లంచాల మేతగాళ్లలో గొప్ప ధీమా ఉట్టిపడుతోంది. స్వల్ప వ్యవధిలో ఆ కేసుల్ని చకచకా తెమిల్చేలా ప్రత్యేక న్యాయస్థానాలు నెలకొల్పాలన్నది నీతి ఆయోగ్ సూచన. అదొక్కటే సరిపోదు. అవినీతి ఆరోపణలు వచ్చిన సందర్భంలో ప్రాథమిక ఆధారాలున్నట్లు ఏసీబీ నిర్ధారించడంతోనే అతగాడి ఉద్యోగాన్ని ఊడబెరికి అక్రమాస్తుల్ని స్వాధీనం చేసుకుని లంచావతారుల్ని ఒడ్డునపడ్డ చేపల్లా చేసేలా నిబంధనావళిని ప్రక్షాళించాలి.

పైరవీలతో, పలుకుబడితో, భారీగా ముడుపులు చెల్లించీ ఇతరత్రా ప్రలోభపెట్టీ ఉద్యోగాలు, కీలక బాధ్యతలు దక్కించుకుంటున్నవాళ్లు- అంతకంతా లంచాల రూపేణా కూడగట్టాలని ఉరకలెత్తుతున్నారు. కొమ్మలు విరిచినంత మాత్రాన విషవృక్షం అంతరించిపోదు. అసలది మొలకెత్తకుండానే చూసుకోవడం సర్వోత్తమం. ప్రభుత్వ నియామకాలన్నీ పారదర్శకంగా జరిపి, తీసుకుంటున్న జీతానికి తగ్గట్లు విద్యుక్త ధర్మం నిర్వహించని సిబ్బంది జీవితమే దుర్భరమయ్యేలా విధివిధానాల్ని పరిపుష్టీకరించాలి. అవినీతి మేతను కట్టడి చేశాకనే సింగపూర్ అద్భుత ప్రగతికి చిరునామాగా ఎదిగింది. గాడి తప్పేవాళ్ల తాట తీసే చొరవ కనబరచిన హాంకాంగ్ సైతం ప్రణాళికాబద్ధంగా పురోగమిస్తోంది. అందుకు విరుద్ధంగా ఇక్కడ పట్టపగ్గాల్లేని అవినీతి పోకడలు, లంచాల భ్రష్టసంస్కృతి జాతిమూలగను జుర్రేస్తున్నాయి.

జలగలు, పందికొక్కుల లక్షణాల్ని పుణికిపుచ్చుకొన్న అధికార సిబ్బంది, గుత్తేదారులు, దళారుల భరతం పట్టే సమగ్ర ప్రక్షాళనే సుపరిపాలనకు దారితీస్తుంది. ఏమంటారు?

(ఈనాడు సౌజన్యంతో) ✧

# అవినీతి నిర్మూలనకు పాలకులు చేపట్టాల్సిన అసలు చర్యలివీ..

- డా॥ జయప్రకాష్ నారాయణ్



### 1. రోజువారీ పనులకు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు

**సమస్య**

ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజలకు ప్రభుత్వాలు రోజువారీ అందించాల్సిన సేవలు మనదేశంలో అధ్వాన్నంగా ఉన్నాయి. మన మౌలికవసతులు, తాగునీరు, పారిశుధ్యం, మురుగునీటి పారుదల, విద్య, ఆరోగ్యం.. ఏవీ నాగరిక ప్రపంచస్థాయికి సరితూగవు. విశ్వసనీయతలేనివి, నాసిరకమైనవి. వీటికితోడు ప్రతి చిన్న పనికీ.. హక్కుగా అందాల్సిన ప్రతి ప్రభుత్వ సేవకీ కూడా ప్రజలు లంచం ఇవ్వాల్సి వస్తోంది. ఈ లంచం ఇవ్వకపోతే ఆలస్యాలు, వాయిదాలు, మళ్లీ మళ్లీ తిరగటాలు, వేధింపులు, అవమానాలు, తిరస్కారాలు తప్పవు. రేషన్ కార్డు, జనన ధ్రువపత్రం, ఆదాయ లేదా కుల ధ్రువపత్రం, భూముల రికార్డులు, సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్, నీటి కనెక్షన్, విద్యుత్ కనెక్షన్ వంటివి చాలా సందర్భాల్లో లంచం ఇవ్వకుండా రావు.

**ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్య**

**'పౌర సేవల' చట్టం**




ప్రతి ప్రభుత్వ సేవకీ నిర్ణీత గడువుని పెట్టి, అది దాటాక ఆలస్యం జరిగితే రోజుకు కొంత డబ్బుని పరిహారం కింద దరఖాస్తుదారులైన ప్రజానీకానికి హక్కుగా అందించే పౌరసేవల (రైట్ టూ సర్వీసెస్/ పబ్లిక్ సర్వీసెస్ గ్యారంటీ) చట్టాన్ని గనక వెంటనే అమలుచేస్తే, తాము కట్టిన పన్నులకు తగ్గ సేవలు అందుతున్నాయని పౌరుల్లో సంతృప్తి పెరిగి, స్వచ్ఛందంగా పన్నులు చెల్లిస్తారు. ప్రజలకు, ప్రభుత్వానికీ మధ్య పరస్పర విశ్వాసం పెరుగుతుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలను సక్రమంగా అందించకపోవడం వల్ల ఎక్కువగా నష్టపోతున్నది పేద, మధ్యతరగతి వారే కాబట్టి.. హక్కుగా పౌరసేవల చట్టం వల్ల అదనపు ఖర్చు లేకుండానే ఈదేశంలోని అత్యధిక శాతం ప్రజలకు రోజువారీ బలవంతపు లంచాల భారం లేకుండా చేసి వారి జీవితాల్ని మెరుగుపరచవచ్చు.

### 2. ప్రభుత్వ కార్యాలయాల్లో భారీ అవినీతి

**సమస్య**

ఒక్కసారి పౌరసేవల గ్యారంటీలతో చిన్నస్థాయి అవినీతిని తగ్గించి, స్థానికానికి పరిమితం చేశాక.. అధికారానికి జవాబుదారీతనాన్ని జోడించటం, లాలూచీతో చేసే భారీ అవినీతిని నిరోధించటం సమస్యలుగా మిగిలివుంటాయి. భారీ అవినీతిలో, లంచం ఇచ్చేవారు, లంచం పుచ్చుకునేవారు ఇద్దరూ ప్రజలను మోసం చేస్తూ పోటీని తగ్గించి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తుంటారు. ప్రకృతి వనరుల్ని దోచుకుంటూ ప్రజా ప్రయోజనాల్ని, ప్రజలకు అందాల్సిన సేవల్ని కొల్లగొడుతూ పర్యావరణానికి కూడా హానిచేస్తుంటారు. ఈ లాలూచీ అవినీతిని వేగంగా, కఠినంగా నిర్మూలించకపోతే, ఇది నగదు నుంచి స్థిర, ఇతర ఆస్తులుగా, విదేశీ ఎకౌంట్లలో డిపాజిట్లుగా మారిపోయి అవినీతికి రాచమార్గంగా

తయారవుతుంది. ఈ భారీ, లాలూచీ అవినీతిని నిరోధించడానికి మూడు ఆచరణాత్మకమైన చర్యలు అవసరం.

**ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్య**

ఎ) అవినీతి నిరోధక చట్టంలో చేసిన మతిలేని సవరణల్ని ఉపసంహరించుకోవాలి. తమకు హక్కుగా అందాల్సిన సేవల కోసం గతిలేక బలవంతంగా లంచాలిచ్చే సామాన్య పౌరులకు కూడా 3 ఏళ్ల జైలు శిక్షను ఈ సవరణల్లో తప్పనిసరి చేశారు. మరోవైపు, లంచం తీసుకునేవారిపై పై నుంచి కిందిస్థాయి వరకు కనీసం పోలీసు దర్యాప్తు చేయాలన్నా ముందస్తు అనుమతి కావాలన్నారు. బాధిత ప్రజలకు శిక్ష, లంచగొండులకు రక్ష అన్న ఈ సవరణల్ని తొలగించి.. హక్కుగా అందాల్సిన సేవలకు బలవంతంగా లంచం ఇచ్చే పౌరులకు పూర్తి రక్షణ ఇవ్వాలి. ఉద్దేశపూర్వకంగా చేసే దర్యాప్తులకు అవకాశం లేకుండా ప్రభుత్వ స్థాయిలో విధానపరమైన అంశాల్లో మాత్రమే ప్రభుత్వోద్యోగులకు రక్షణ కల్పించాలి. ప్రభుత్వ విధానాలకనుగుణంగా సదుద్దేశంతో తీసుకున్న నిర్ణయాలలో ఉద్యోగులను ఇరికించకూడదు.

బి) తీవ్ర అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారుల్లో కనీసం ఓ 1000మందికి తప్పనిసరి రిటైర్‌మెంట్ ఇచ్చి ఇంటికి పంపించాలి. వ్యవస్థలోని రాజకీయ నాయకులు, అధికారులు, మీడియా, వాణిజ్యవేత్తలు అందరికీ తెలుసు అవినీతిపరులు ఎవరు అనేది. కానీ మౌనం వహిస్తుంటారు. 50 ఏళ్ల వయసు లేదా 25 ఏళ్ల సర్వీసు అనంతరం ఎటువంటి కారణం లేకుండా వారి చేత పదవీవిరమణ చేయించే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఈ చర్య సరైన, బలమైన సంకేతం ఇవ్వాలంటే.. దేశానికి నష్టం చేసిన అత్యంత అవినీతిపరుల్ని ఎటువంటి భయం, పక్షపాతం, ద్వేషం లేకుండా ప్రభుత్వం గుర్తించాలి. తన నిర్ణయాల్లో పూర్తి న్యాయబద్ధంగా, నిష్పాక్షికంగా ఉండాలి. లేకుంటే, దీనివల్ల మంచి కంటే చెడు ఎక్కువ జరుగుతుంది.

సి) స్మగ్లింగ్, విదేశీ మారక ద్రవ్య అక్రమాలకు పాల్పడేవారిని కట్టడి చేయడానికి 1976లో రూపొందించిన 'సఫెమ' (ఎస్ఎఎఫ్ఈఎంఎ) తరహాలో అవినీతిని నిరోధించడానికి చట్టం తీసుకురావాలి. 1988లో సుప్రీంకోర్టు కూడా ఇదే మాట చెప్పింది. అవినీతిని అంతం చేయడానికి ఇటువంటి చట్టం అవసరమని అత్యున్నత న్యాయస్థానం విస్పష్టంగా సూచించింది. ఈ చట్టంలో మూడు కీలక ఏర్పాట్లు ఉండాలి- బినామీ ఆస్తులు సహా మొత్తం ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం, 15 ఏళ్లు లేదా ఇంకా ఎక్కువ జైలు తప్పనిసరి చేయడం, ప్రాథమిక సాక్ష్యం ఉంటే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యతను నిందితుని మీదకే మళ్లించటం.

## 3. రాజకీయ అవినీతి

**సమస్య**

మన దేశానికి ఎంతో ఘనచరిత్ర, రాజకీయ నేపథ్యం ఉండవచ్చు. కానీ ఒక్క ఓటు ఎక్కువ వస్తే ఆ అభ్యర్థి మాత్రమే విజేత, మిగిలినవారంతా ఓడిపోయినట్టే అనే ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ (ఎఫ్‌పిటిపి) ఎన్నికల వ్యవస్థలో గెలుపునకు కీలకమైన కాసిని అదనపు ఓట్ల వేట.. ఇప్పుడు మన పేదదేశంలో ఓట్ల కొనుగోలుకు మూలంగా ఉంది. గెలుపునకు కావలసిన ఆ కొద్ది ఓట్ల కోసం.. ప్రధాన పోటీదారుల్లో చాలామంది అభ్యర్థులుగా, పార్టీలుగా విచ్చలవిడి ఓట్ల కొనుగోలుకు పాల్పడుతున్నారు. ఎంత ఖర్చు చేసినా గెలుపునకు గ్యారంటీ ఉండదుగానీ, ఎన్నికలలో బలమైన అభ్యర్థిగా పోటీలో ఉండాలంటే, భారీయెత్తున లెక్కలు చూపని డబ్బు ఖర్చు చేయటం కనీస అర్హతగా మారింది. ఈరకంగా, రాజకీయ విజయానికి డబ్బు గ్యారంటీ ఇవ్వకపోయినా, ఓ తప్పనిసరి ప్రవేశ రుసుముగా మారి నిజమైన రాజకీయ పోటీని, రాజకీయాలలో ఆరోగ్యకర ప్రోత్సాహకాల్ని ఛిన్నాభిన్నం చేసి అనర్హులను, తప్పుడు వ్యక్తులను ప్రోత్సహించి ప్రజాసేవాభావంగల సమర్థ పౌరులను రాజకీయాలకు దూరం చేసింది. అవినీతి, దుష్పరిపాలన, అయినకాడికి దండుకుందామనే నిరాశావాదం.. అసమర్థతలమయమైన వ్యవస్థను సృష్టించింది.

**ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్య**

'రాష్ట్రాల్లో దామాషా ఎన్నికల' పద్ధతి

ఒక రాష్ట్రంలో ఓ పార్టీకి వచ్చిన ఓట్ల వాటాను బట్టి సీట్లను కేటాయిస్తే (దామాషా ఎన్నికల పద్ధతి) గెలుపు కోసం అదనపు ఓట్లు ఇక కీలకం అవ్వవు. ఒక్క ఓటుతో గెలిచినవారిదే విజయం అవదు. ఓట్ల కొనుగోలుకు బరితెగింపు, వెంపర్లాట ఉండవు. నైతిక పౌరబృందాలకు, పార్టీలకు అవకాశాలు ఉంటాయి. పాలనలో ఏకాభిప్రాయ సాధన తప్పనిసరి అవుతుంది. అన్ని రకాల భావాలకూ ప్రాతినిధ్యం లభిస్తుంది. నైతిక రాజకీయాలు, నిజమైన ప్రజాసేవాభావం గల వారు పార్టీలకు ఓ బలహీనతలా కాకుండా బలంగా మారతారు.

దామాషా ఎన్నికల పద్ధతి (పి.ఆర్)లో రకరకాల నమూనాలున్నాయి. కానీ రాష్ట్రాల్లో కనీస స్థాయి ఓట్ల శాతం ప్రాతిపదికగా సీట్ల కేటాయింపు చేయటం, ప్రజలకు, వారి ప్రజాప్రతినిధులకు సంబంధం కొనసాగడానికి బహుళ సభ్యత్వ నియోజకవర్గాలను ఏర్పాటు చేయటం భారతదేశ పరిస్థితులకు అత్యుత్తమ నమూనా.

అటువంటి పి.ఆర్ విధానాన్ని ప్రవేశపెట్టటం సాంకేతికంగా కూడా తేలిక. కేవలం చట్టంలో మార్పు చేస్తే చాలు. అయితే, కేంద్రంలో ఒక ప్రధాన పార్టీ ఎఫ్.పి.టి.పి విధానం ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉంది కాబట్టి.. జాతీయ స్థాయిలో దీన్ని అమల్లోకి తేవటం ఇప్పటికిప్పుడు కష్టం కావచ్చు. అయినా, జాతీయస్థాయిలో రాజకీయ ఏకాభిప్రాయం కుదిరితే రాష్ట్రాల్లో దామాషా ఎన్నికల నమూనాను అమలు చేయవచ్చు. అసలైన రాజకీయాలు, పాలనా సవాళ్లు రాష్ట్రాల్లోనే ఉన్నాయి. బ్రిటన్ (యునైటెడ్ కింగ్‌డమ్)నే తీసుకుంటే, జాతీయ, రాష్ట్రాల స్థాయిల్లో ఒకేరకమైన ఎఫ్.పి.టి.పి ఎన్నికల నమూనా ఉండనక్కర్లేదని అర్థమవుతుంది. యు.కెలో దిగువసభను ఎఫ్.పి.టి.పి నమూనాలో ఎన్నుకుంటే, స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్, వేల్స్‌లోని ప్రాంతీయ పార్లమెంటుల్ని దామాషా పద్ధతిలో ఎన్నుకుంటారు. ఐరోపా పార్లమెంట్ సభ్యులు ఇప్పటి వరకూ ఇలాగే ఎన్నికవుతున్నారు (బ్రెగ్జిట్ వాస్తవరూపం దాల్చేంతవరకు). అదేవిధంగా లండన్ మేయర్‌ని ప్రజలంతా ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు.

కాబట్టి దామాషా ఎన్నికల పద్ధతి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు పనికొచ్చే ఆచరణాత్మకమైన సంస్కరణ. రాష్ట్రాల్లో రాజకీయాలు, పాలన స్వభావాన్ని సమూలంగా మార్చగల సంస్కరణ. ప్రతి పౌరునీ ప్రభావితం చేసే పాలన రాష్ట్ర, స్థానిక స్థాయిల్లోనే ఉంది కాబట్టి, దీనికి సమూల పరివర్తనా శక్తి ఉంది. బహుళ సభ్యత్వ నియోజకవర్గాలకు రాజ్యాంగం వెసులుబాటు కల్పించింది కాబట్టి ఈ ఎన్నికల ఏర్పాటుని పార్లమెంటులో ఒక సాధారణ చట్టం తెచ్చి అమలుచేసేయొచ్చు.

## రాష్ట్రాల్లో ప్రత్యక్ష ఎన్నికలు

లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికల గురించి ఇప్పుడు విస్తృతస్థాయి చర్చ జరుగుతోంది కనుక, ఈ లక్ష్యాన్ని అమలు చేయటానికి రాష్ట్రాల్లో ప్రభుత్వాధినేతను ప్రత్యక్షంగా ప్రజలంతా కలిసి ఎన్నుకోవటం అత్యుత్తమ మార్గమవుతుంది. అధికారాల విభజన, నిర్ణీత పదవీకాలం, పోటీ పరిమితులు, అసెంబ్లీ వెలుపలి నుంచి కూడా సమర్థులను మంత్రివర్గంలోకి తీసుకునేందుకు ప్రభుత్వాధినేతకు స్వేచ్ఛ వంటివి ఈ ఏర్పాటులో భాగంగా ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా ఎన్నుకుంటున్నప్పుడు అభ్యర్థి ఓట్ల కొనుగోలును ఆ స్థాయిలో చేయటం దాదాపు అసాధ్యమవుతుంది. వచ్చే లాభం కంటే చేసే అక్రమ ఖర్చు అనేకరెట్లు ఎక్కువ ఉంటుంది కాబట్టి ఓట్ల కొనుగోలుతో పోటీకి సాహసం చేయరు. అప్పుడు నాయకులు, పార్టీలు ఓట్ల కొనుగోలుకన్నా వ్యక్తిత్వం, నిజాయతీ, గతంలో తాము చేసిన పనులు, అభ్యర్థి విశ్వసనీయత, ఎజెండా వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తారు. అదేసమయంలో, ప్రభుత్వాధినేత (ముఖ్యమంత్రి) తన మనుగడ, పాలన కోసం శాసనసభలో మెజారిటీ మీద ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఫిరాయింపుల ద్వారానో, మరోరూపంలోనో ఎమ్మెల్యేలు తమ పదవిని అడ్డంపెట్టుకుని ప్రజాధనాన్ని దండుకునే అవకాశాలు ఉండవు (బదిలీలు, కాంట్రాక్టులు, ఇతర అనుచిత సహాయాల కోసం ప్రభుత్వాన్ని ఎమ్మెల్యేలు ఒత్తిడి చేయలేరు). కాబట్టి, ఓట్ల కొనుగోలు కోసం భారీ పెట్టుబడులు పెట్టటం ఎంతమాత్రం లాభసాటి అవదు. ఈరకంగా మొత్తం వ్యవస్థ విషవలయం నుంచి ఓ మేలిమి వలయంలోకి ప్రవేశిస్తుంది. నల్లడబ్బు, అవినీతి గణనీయంగా తగ్గుతాయి.


## జవాబుదారీతనం, సాధికారత ఉన్న స్థానిక ప్రభుత్వాలు

ప్రజలు తమ ఓటుకు-తమ జీవితాల్లో ప్రయోజనాలకు, పన్నులకు-సేవలకు మధ్య సంబంధాన్ని అర్థం చేసుకునేలా చేసేవి- సరైన నిర్మాణం, జవాబుదారీతనం ఉన్న స్థానిక ప్రభుత్వాలే (రెసిడెంట్స్ సంక్షేమ సంఘాలు- ఆర్‌డబ్ల్యుఏల తరహాలో). ఇలాంటి సాధికారత గల స్థానిక ప్రభుత్వాల్లో అధికారాన్ని జవాబుదారీతనంతో సంధానం స్పష్టంగా చేయొచ్చు. జవాబుదారీతనానికి కచ్చితమైన గీతలుంటాయి, బాధ్యతల నుంచి తప్పించుకుని కుంటిసాకులు చెప్పటానికి అవకాశముండదు. ఏడవ షెడ్యూల్‌లో పేర్కొన్న జాబితా ప్రకారం బాధ్యతల్ని బదిలీ చేసి స్థానిక ప్రభుత్వాలను నిజమైన మూడో అంచె ప్రభుత్వాలుగా గుర్తించి, రాష్ట్రాలతోపాటు ఆర్థిక సంఘం ద్వారా నిర్దిష్ట వాటా నిధుల్ని పంపిణీ చేస్తే మన ప్రజాస్వామ్యంలో పెద్దఎత్తున పరివర్తన చోటుచేసుకుంటుంది. ఓట్ల కొనుగోలు, నల్లధనం, అవినీతి బాగా తగ్గుతాయి. మేలిమి వలయం వేళ్లూనుకునేలోగా.. సర్వాంతర్యామిగా వున్న అవినీతి, దుష్పరిపాలన స్థానిక ప్రభుత్వాలను నాశనం చేయకుండా మనకు పటిష్టమైన, స్వతంత్ర ప్రతిపత్తిగల స్థానిక అంబుడ్స్‌మన్ కూడా ఉండాలి.

ఈ ఐదు మౌలికమైన సంస్కరణలు- హక్కుగా పౌరసేవలు, పన్ను రేట్లు-రియల్ ఎస్టేట్-పాలన, భారీ లాలూచీ అవినీతి కట్టడి, స్థానిక స్వయంపాలన, ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన- కూడా మనకు అందుబాటులో వున్న, మనం సాధించుకోదగ్గ లక్ష్యాలు. పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) కష్టాన్ని కూడా ఓర్చుకున్న ప్రజలు ఈ ప్రధాన సంస్కరణలను కూడా స్వాగతిస్తారు. మనకు కావలసిందల్లా- లక్ష్యం పట్ల స్పష్టత, స్పష్టమైన వ్యూహం, స్వేచ్ఛా సమాజాలు ఎలా పనిచేస్తాయో లోతైన అవగాహన. మొదటి నాలుగింటినీ తేలికగా, జనరంజకంగానే అమలు చేయవచ్చు. ప్రధానమైన రాజకీయ సంస్కరణకు ప్రజల మద్దతు, స్థూల ఏకాభిప్రాయ సాధనతో తగిన పరిస్థితుల్ని కల్పించవచ్చు. సమయం వృధా కాకుండా చూసుకోవటం ముఖ్యం. ✧

# బస్తీ దవాఖానాలు: ప్రజారోగ్య సామర్థ్యాన్ని పెంచుతాయా?

- అరుణ్ తేజ




తెలంగాణలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి బస్తీ దవాఖానాలు మొదలయ్యాయి. ఢిల్లీలో అమలుపరుస్తున్న 'మొహల్లా క్లినిక్'ల మోడల్‌లో హైదరాబాద్‌లో బస్తీ దవాఖానాల్ని ప్రారంభించారు.

వీటి గురించి మాట్లాడుకునే ముందు.. రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య సంరక్షణ గురించి కొంత ప్రస్తావించుకోవటం అవసరం.

మన రాష్ట్రంలో 4,863 సబ్ సెంటర్లు, 668 పీహెచ్‌సీలు, 114 సీహెచ్‌సీలు, 87 యూహెచ్‌సీలు, 42 ఏరియా ఆస్పత్రులు, 8 జిల్లా ఆస్పత్రులు ఉన్నాయి. ఆకర్షణీయంగా ఉన్న ఈ అంకెల ప్రకారం సేవలు అందితే.. పెద్దాస్పత్రుల దాకా వచ్చే శ్రమ, ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు భారీ బిల్లుల చెల్లింపులు లేకుండానే ప్రజలకు చాలా జబ్బులు తేలిగ్గా నయమై పోతుండాలి. కానీ వ్యవస్థ అంత చక్కగా ఏమీ నడవటం లేదు. వైద్య భారం జనాన్ని అమితంగా పీడిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో ఉంది.

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నదుపాయాలు అధ్వాన్నంగా ఉండటం, వైద్యులు అందుబాటులో లేకపోవటం వంటి కారణాలతో సామాన్య ప్రజలు జిల్లాల నుంచి హైదరాబాద్ పెద్దా స్పత్రులకు వస్తుంటే.. సబ్ సెంటర్లు లేకపోవటం, పెద్దాస్పత్రులు అందుబాటులోనే ఉండటంతో రాజధాని బస్తీల నుంచి పెద్దసంఖ్యలో వైద్యసేవలకు ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు వస్తున్నారు. ఈ రకంగా, ఏ చిన్న జబ్బు వచ్చినా నేరుగా పైస్థాయి ప్రభుత్వాస్పత్రికే వెళ్లటం రాష్ట్రంలో ఆనవాయితీగా మారిపోయింది. ఉస్మానియా, గాంధీ వంటి పెద్దాస్పత్రులకు రోగుల తాకిడి విపరీతంగా ఉంటోంది. బెడ్‌ల సంఖ్యకు రెట్టింపు ఐపీ రోగులుండటం ఈ ఆస్పత్రుల్లో సాధారణ దృశ్యం. ఇక్కడికొస్తున్న రోగుల్లో చాలామందికి చికిత్సను స్థానిక ఆరోగ్య కేంద్రాల్లోనే చేసేయొచ్చు.

ఈ నేపథ్యంలో.. మెరుగైన వైద్యాన్ని స్థానికంగా బస్తీలోనే అందించే ఏర్పాటు చేయగలిగితే సామాన్యులు పెద్దాస్పత్రులకు, ప్రైవేటు వైద్యానికి వెళ్లాల్సిన అవసరం ఉండదనే ఉద్దేశంతో ఢిల్లీ తరహాలో బస్తీ దవాఖానాల్ని ప్రారంభించారు. ఇందుకు జాతీయ అర్బన్ హెల్త్ మిషన్ కమిషనర్ వాకాటి కరుణ బాగా

చౌరవ చూపారు. జూన్ వరకు నెలకొల్పిన 17 బస్తీ దవాఖానాలను అక్టోబర్‌కు 64, డిసెంబర్ నాటికి 100కు చేర్చాలని హైదరాబాద్ మహానగర పురపాలక సంఘం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

నిబంధనల ప్రకారం, బస్తీ దవాఖానాలు ప్రజలకు ప్రథమ వైద్య సేవాకేంద్రాలు (ఫస్ట్ పాయింట్ ఆఫ్ మెడికల్ కాంటాక్ట్/గేట్ కీపర్)గా పనిచేస్తాయి. ఒక్కో కేంద్రం 10,000 మంది ప్రజలకు సేవలందించాలి. ఇక్కడ ఉచితంగా వైద్యం, మందులు అందిస్తారు.

**బస్తీ దవాఖానాలు ఎక్కడెక్కడ..**

| ల్యాండ్‌మార్కు | ప్రాంతం |
|---|---|
| శ్యామ్‌లాల్ బిల్డింగ్ | ప్రకాష్ నగర్ |
| బిర్ నగర్ | మల్కాజ్‌గిరి |
| అరుంధతి నగర్ | కవాడిగూడ |
| నర్కీ ఫూల్‌బాగ్ | నసీబ్ నగర్ |
| ప్రశాసన్ నగం | జూబ్లీహిల్స్ |
| గడ్డిఅన్నారం | దిల్‌షుక్‌నగర్ |
| గుడ్డిబౌలి | యాకత్‌పుర |
| బాకారం | ముషీరాబాద్ |
| నందనవనం | పీర్జాదిగూడ (జామియా మసీదు వద్ద) |
| ఇందిరాగాంధీపురం | బల్కంపేట |
| హష్మాబాద్ | ఫలక్‌నుమా |
| లక్ష్మీనారాయణ కాలనీ | ఉప్పల్ |
| గంగానగర్ | అంబర్‌పేట్/యాకత్‌పుర |
| చాచా నెహ్రూ నగర్ | బేగంపేట్ (ప్యారడైజ్ మెట్రో సమీపంలో) |
| రంగనాయకుల గుట్ట | హయత్‌నగర్ |
| ఎల్లమ్మబండ | కూకట్‌పల్లి (ఉషా ముళ్లపూడి రోడ్డు) |
| ఎర్రకుంట | కాప్రా సర్కిల్ |

### పనితీరు, బడ్జెట్ కేటాయింపులు

పనితీరుకు వస్తే.. ప్రతి దవాఖానాకు ఒక మెడికల్ ఆఫీసర్, నర్స్, సహాయ సిబ్బంది ఒకరు ఉంటారు. డీహెచ్ఎస్ (జిల్లా ఆరోగ్య సంఘం) జారీ చేసిన ప్రకటన మేరకు దరఖాస్తు చేసుకున్న వైద్యులలో అర్హులను ఎంపిక చేసి మెడికల్ ఆఫీసర్‌లుగా నియమిస్తారు. నర్సులను కూడా ఇదే మాదిరిలో ప్రభుత్వం ఎంపిక చేస్తుంది. సహాయ సిబ్బందిగా మాత్రం బస్తీకి దగ్గరలో నివసించేవారిని తీసుకుంటారు. రోగులకు ప్రత్యేక వైద్యసేవల ఆవశ్యకత ఉంటే వారిని అర్బన్ హెల్త్ సెంటర్ లేదా ఉస్మానియా తదితర ఆస్పత్రులకు సూచిస్తారు. రక్త పరీక్షలు, ఇతర సాధారణ పరీక్షలను ప్రభుత్వం కొత్తగా మొదలు పెట్టిన 'తెలంగాణ డయాగ్నోస్టిక్ ప్రోగ్రామ్' ద్వారా అందచేయనున్నట్టు సమాచారం. వచ్చిన రోగుల వివరాలు, ఆధార్ నంఖ్యను డిజిటల్ రికార్డులుగా నిర్వహిస్తున్నట్టు, అవి అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఉపలబ్ధం కానున్నట్టు సమాచారం. ప్రస్తుతం వాడుకలో ఉన్న యాప్ ద్వారా మాత్రం పెద్దగా ఉపయోగం కనిపించటం లేదు.

ఇలా ఒక్కో దవాఖానా నిర్వహణ కోసం ఏటా రూ.16 లక్షల ఏకమొత్తాన్ని కేటాయిస్తారు. ఇందులో నుంచి మెడికల్ ఆఫీసర్‌కి రూ.35,000, నర్సుకు రూ.15,000, సహాయ సిబ్బందికి రూ.10,000 నెలసరి చెల్లిస్తారు. ఔషధాల విక్రయానికి ప్రతి నెలా రూ.10,000 కేటాయించారు.

### మరి ఇవి సక్రమంగా పనిచేస్తున్నాయా?

బస్తీ దవాఖానాలు ఎలా పనిచేస్తున్నాయో ఇటీవల ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ఇంటెర్న్‌గా ప్రత్యక్షంగా పరిశీలించాం. అందులో కనిపించిన కొన్ని విషయాలివి.

లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ 2005లో రూపొందించిన జాతీయ ఆరోగ్య మిషన్‌లోని చాలా అంశాలను కేంద్ర ప్రభుత్వం కుదించి జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌గా

ప్రారంభించింది. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్‌ను దశలవారీగా అమలు చేయటం మొదలుపెట్టింది. ఆలస్యంగానైనా ప్రారంభించారు, ఇక ముందైనా ప్రజలకు కొంత మేలు జరుగుతుంది అనుకుందామనుకున్నా.. అలవిమాలిన నిర్లక్ష్యం, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిధుల వినియోగంలో సమన్వయం లేకపోవటం రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తూనే ఉన్నాయి. తాజాగా బస్తీ దవాఖానాలను కూడా ఇదే శాపం వెన్నాడుతోంది.

రోజువారీ వాడుకకు కావలసిన నీరు, మరుగుదొడ్డి సదుపాయం కూడా లేకుండా దవాఖానాలను మొదలుపెట్టారు. ఇందిరాగాంధీపురంలోని దవాఖానకు కనీసం విద్యుత్తు సరఫరా, తాగునీరు సదుపాయం కూడా లేవు.

బాకారంలో ఉన్న దవాఖానకు దిశ బోర్డు ఉందిగానీ, మిగతా చోట్ల దవాఖానాలు ఎక్కడున్నాయో తెలుసుకోవడం చుట్టుపక్కల వాళ్లకి కూడా కష్టమే.

ప్రయివేటు భాగస్వామ్యాన్ని సేవలకు కాకుండా.. మౌలిక వసతులకు ఎక్కువగా ఉపయోగించుకునే విధంగా మరిన్ని జాగ్రత్తలు అవసరం. పీపీపీలో వైద్య సేవలు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండటం వల్ల ప్రజలకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది.

డిసెంబర్‌లోగా దవాఖానాల సంఖ్యను 100కు చేరుస్తామంటున్నారు. కానీ నిజమైన మార్పు కనిపించాలంటే కనీసం 1000 దవాఖానాలుండాలి.

దవాఖానాలను 1000కి పెంచినా, వాటిల్లోకి వైద్యులు ఎక్కడ అనేది చిక్కు ప్రశ్నే. గ్రామీణ ప్రాంతాల్లో సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నా అక్కడికి వెళ్లకుండా చిన్న జబ్బులకు కూడా జిల్లా కేంద్రంలోని, హైదరాబాద్‌లోని పెద్దాస్పత్రులకు వెళ్లటానికే ఎక్కువమంది ప్రజలు మొగ్గు చూపటానికి కారణం- అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవటం, ఆ కేంద్రాల పట్ల ప్రజల్లో విశ్వాసం లేకపోవటం. డాక్టర్లు, నర్సులకు సరైన ప్రోత్సాహకాలను ఇచ్చే వ్యవస్థీకృత ఏర్పాటు చాలా అవసరం.

భరోసా ఇచ్చే వైద్యసిబ్బందికి తోడు వ్యాధి నిరోధక చర్యలు, వార్డు స్థాయి ప్రభుత్వాల పర్యవేక్షణ వంటి ఏర్పాట్లు ఉంటేనే బస్తీ దవాఖానాల పట్లయినా ప్రజల్లో విశ్వాసం ఏర్పడి చికిత్స కోసం వస్తారు. ఇందిరాగాంధీపురంలో నియమించిన మెడికల్ ఆఫీసర్.. వచ్చిన కొద్దిరోజుల్లోనే పైచదువుల కోసమంటూ వెళ్లిపోయారు.

హన్స్ రోస్లింగ్, ఓల రోస్లింగ్, అన రోస్లింగ్ రచించిన 'ఫ్యాక్ట్‌ఫుల్‌నెస్' పుస్తకంలో.. పొరుగు దేశమైన బంగ్లాదేశ్ తలసరి ఆదాయం తక్కువ ఉన్నప్పటికీ, అక్కడి ప్రజల ఆయు:ప్రమాణం భారతదేశంలోనివారి కంటే ఎక్కువగా ఉంది. వీరు రూపొందించిన గాప్‌మెండర్ 'ప్రపంచ ఆరోగ్య పట్టీ' ప్రకారం.. శ్రీలంక తలసరి ఆదాయం, ఆయు:ప్రమాణంలో ముందుంది. వ్యాధి నివారణకు పెద్దపీట వేయటం వల్లే శ్రీలంక ఈ ఆధిక్యతను సాధించింది. ఆ దార్శనికత, కార్యాచరణ ప్రస్తుతానికి బస్తీ దవాఖానాల్లో కనిపించటం లేదు. చాలా ముందుచూపుతో, అవగాహనతో వ్యవహరిస్తేనే దవాఖానాలు ప్రజా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా నిలదొక్కుకుంటాయి.

ఈ వాస్తవాల్ని బస్తీ దవాఖానాల పర్యవేక్షణాధికారి కూడా (తన పేరు వెల్లడించవద్దంటూ) అంగీకరిస్తున్నారు. కాకపోతే.. ఆయన దృష్టిలో వార్డు ప్రభుత్వమంటే కార్పొరేటర్, స్థానిక పార్టీ నాయకులు. వార్డు ప్రభుత్వంలో ఎన్నికైన పౌర సమాజం కూడా ఉండి, కమిటీలుగా ఏర్పడి, అందులో ఓ కమిటీ విధిగా ఆరోగ్య రంగం మీద దృష్టి పెడితేనే బస్తీ దవాఖానాలు నిజమైన ప్రజారోగ్య కేంద్రాలుగా రూపుదిద్దుకుంటాయి, వ్యాధి నివారణ చర్యలు కూడా పటిష్టంగా అమలవుతాయి. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న 'ఆయుష్మాన్ భారత్' (జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం) ద్వారా బస్తీ దవాఖానాలు వెల్‌నెస్ సెంటర్లలో భాగం కావచ్చు. వాటిని ఏ రకంగా మారుస్తారు, ఏ పేరుతో పిలుస్తారు వంటి ప్రశ్నల్ని పక్కనపెడితే.. ప్రాథమిక ఆరోగ్యాన్ని బాగుచేయటానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తేనే ప్రజారోగ్య సంరక్షణ సామర్థ్యం పెరుగుతుంది. లోక్‌సత్తా రూపొందించిన హెల్త్ పాలసీలోని ఫ్యామిలీ డాక్టర్ పద్ధతిని అనుసరించటం ఇందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ✧

# పర్యాటక పరిశ్రమకు నూతనోత్తేజం- మెడికల్ టూరిజం!

- స్రష్ట వాణి కొల్లి




**జే**మ్స్ సురోవికి ఓ సందర్భంలో చెప్పినట్టు.. "మెడికల్ టూరిజం ఒక రకమైన దిగుమతి లాంటిది! వినియోగదారుడి దగ్గరకు ఉత్పత్తి రావడానికి బదులు, ఉత్పత్తి దగ్గరకే వినియోగదారుడు వెళ్తాడు".

మెడికల్ టూరిజానికి అర్థం ఆ పేరులోనే ఉంది. ఒక వ్యక్తి తన దేశం వైద్య సంరక్షణ, చికిత్స కోసం విదేశాలకు వెళ్లటమే మెడికల్ టూరిజం.

తమ దేశంలో మరీ ఖరీదైన లేదా అందుబాటులో లేని ఆపరేషన్ల కోసమే చాలా సందర్భాల్లో అలా వైద్య పర్యాటకానికి వెళ్తుంటారు.

వ్యాధి నిరోధకత, కోలుకోవటం, నిర్మాణాత్మక ఆరోగ్య సంరక్షణ సదుపాయాల కోసం ప్రజలు ఇతర దేశాలకు వెళ్లటం కాబట్టి.. దీన్ని ఆరోగ్య పర్యాటకం (హెల్త్ టూరిజం) అని కూడా పిలుస్తుంటారు.

మెడికల్, హెల్త్ టూరిజం ఆనవాళ్లు మనకు 18వ శతాబ్దకాలంలో కూడా కనిపిస్తాయి. తక్కువ ఖర్చులో, తమ బడ్జెట్‌కు తగ్గ చికిత్స కోసం ముందుకొస్తున్నవారి సంఖ్య ఎక్కువగానే ఉండటం వల్ల ఇప్పటికీ మెడికల్ టూరిజం పట్ల ఆదరణ తగ్గలేదు.

కాలక్రమంలో భారతదేశం వైద్య పర్యాటకానికి కేంద్ర బిందువుగా మారింది. అందుబాటు వ్యయంలో ఉండే ఆరోగ్య సదుపాయాలున్న దేశంగా భారత్ ప్రత్యేకతను సంతరించుకోవటంతో.. అదనపు ఆరోగ్య వ్యయాన్ని తగ్గించుకోవడానికి ప్రపంచం నలుమూలల్నుంచి మనదేశానికి వస్తున్నారు.

ఆర్థికభారం లేకుండా అందే వైద్య సంరక్షణ పట్ల మొగ్గు చూపే పాశ్చాత్యుల సంఖ్య పెరుగుతున్నకొద్దీ.. హెల్త్ కేర్ అనుకూల కేంద్రంగా భారతదేశ ప్రాచుర్యం రోజురోజుకీ పెరుగుతోంది.

ఆరోగ్య పరిరక్షణ కోసం ఓ సాధారణ కుటుంబం 10,000 డాలర్లు ఖర్చు పెట్టే అమెరికాలాంటి దేశంలో.. మోకాలి చిప్పల మార్పిడికి 35,000 డాలర్లు ఖర్చవుతుంది. అదే భారత్‌లో సుమారు 6,600 డాలర్లు అవుతుంది. బైపాస్ సర్జరీకి అమెరికాలో 1,23,000 డాలర్లు వ్యయమైతే, ఇండియాలో దాంతో పోలిస్తే చాలా తక్కువగా 7,900 డాలర్లు ఖర్చవుతుంది. అమెరికాలోనే వైద్యం చేయించుకుని మితిమీరిన భారాన్ని మోసే కంటే భారత్‌కి వెళ్లి తక్కువ ఖర్చుతో వైద్య ఆరోగ్య సేవల్ని పొందటం మెరుగైనదిగా కనిపిస్తోంది. విదేశీయులు ఎక్కువగా దంత చికిత్సలు, గుండె ఆపరేషన్లు, సౌందర్య సంబంధ వైద్యం కోసం భారత్‌ను సందర్శిస్తున్నారు.

మోకాలి చిప్ప, తుంటి మార్పిడి శస్త్రచికిత్సలు, స్టెంట్‌లు, యాంజియోప్లాస్టీ వంటి ప్రాణాపాయంలేని నివారణా చికిత్సల కోసం భారత్‌కు రావటానికి అమెరికన్లు సాదర మొగ్గు చూపుతున్నారు. క్లినికల్ నైపుణ్యాల్లో కీర్తిప్రతిష్టల్ని గడించిన భారతీయ వైద్యుల పట్ల అమెరికన్లకు అత్యున్నత గౌరవభావం ఉంది. అయితే మౌలిక వసతులు, భారతీయ వైద్య వ్యవస్థ ప్రమాణాల పట్ల మాత్రం వారు అపనమ్మకంతో ఉన్నారు. ఈ సంస్థాగత వైఫల్యమే ముమ్ముందు మనదేశంలో మెడికల్ టూరిజం పరిశ్రమకున్న అవకాశాలను దెబ్బతీయవచ్చు.

2016లో కంటే రెట్టింపు మేర 2022 నాటికి భారతదేశ మెడికల్ టూరిజం పరిశ్రమ పెరగవచ్చు. వీసా నిబంధనలను సడలించటం, కొన్ని దేశాలకు వీసా-ఆన్-ఎరైవల్‌ను ప్రవేశపెట్టటం వంటి కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాల వల్ల.. విదేశీ పర్యాటకులు వైద్య సంబంధ కారణాల వల్ల 30 రోజులపాటు భారతదేశంలో ఉండే అవకాశం ఏర్పడింది. చికిత్సకు అవసరమైతే ఈ గడువును ఏడాదికిపైగా కూడా పొడిగిస్తారు.

భారత మెడికల్ టూరిజం మార్కెట్‌కు బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, మాల్దీవుల నుంచి ఎక్కువగా వస్తుంటారు. 2016లో మన టూరిజం మార్కెట్‌లో 55 శాతం కంటే ఎక్కువ వాటా ఈ మూడు దేశాలకే ఉంది. ఇరాక్, ఒమన్, నైజీరియా, కెన్యా దేశాలు ఇండియన్ మెడికల్ టూరిజం మార్కెట్‌లో మిగిలిన ప్రధాన దేశాలు. రష్యా, టాంజానియా, యూఏఈ, యెమెన్‌ల నుంచి ఇప్పుడిప్పుడే భారత్‌కు వైద్య పర్యాటకులు పెరుగుతున్నారు (2016 నాటి వివరాలు).

విస్తరిస్తున్న వైద్య పర్యాటకాన్ని మెరుగుపరిచేందుకు, తగిన తోడ్పాటునందించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని విదేశస్తులకు వెసులుబాటును, సౌకర్యాల్ని ఇంకా పెంచాలి. మార్కెటింగ్‌కు, సేవల్ని లోపరహితంగా అందించటంలో సహకరించేందుకు తగినన్ని యూనిట్లను, ప్రభుత్వ విభాగాలను ఏర్పాటు చేయాలి. ఈ రకమైన చర్యలతోనే పర్యాటక రంగ నూతనోత్తేజం భారతీయ నేపథ్యంలో సుస్థిర వృద్ధిని సాధించగలుగుతుంది. ✧

# వైద్యసేవలు సరిగా లేకపోతే లోక్‌సత్తా వదిలిపెట్టదు





పేద, మధ్యతరగతికి సరైన వైద్యం అందక తీవ్రంగా నష్టపోతున్న కేసులు ఇటీవల విజయనగరం జిల్లాలో పెరిగిపోతున్నాయని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక వైద్య కేంద్రాల్ని పటిష్టం చేయకపోవటం వల్ల పెద్దాస్పత్రి, ఘోషాస్పత్రిపై ఒత్తిడి పెరుగుతోందని, ఇక్కడ కూడా సిబ్బంది కరవవటం వల్ల ప్రజలకు దిక్కుతోచటం లేదని అన్నారు. రోజూ వందల సంఖ్యలో బాలింతలు ఘోషాస్పత్రికి వస్తుంటే, సరిపడా డాక్టర్లు, నర్సులు, చివరికి థియేటర్ అసిస్టెంట్లు కూడా లేరన్నారు. వార్డుకో నర్సు ఉండాల్సుండగా, ఫ్లోర్ మొత్తానికీ ఒక్కరే ఉన్నారన్నారు. 35 మంది నర్సులను నియమించాలన్నారు. తల్లీబిడ్డా క్షేమానికి భరోసా ఇచ్చేలా వెంటనే సిబ్బందిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వైద్యసేవల తీరును నిరసిస్తూ ఘోషాస్పత్రిలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆందోళన చేపట్టారు.

ప్రభుత్వం అంటే ఏం చేయాలో కూడా తెలీని పాలనను, రాజకీయాన్ని పెంచిపోషించుకోవటం వల్ల వైద్య రంగంలో సంక్షోభం నెలకొందని, గిరిజన ప్రాంతాలైతే అల్లాడుతున్నాయని బాబ్జీ అన్నారు. ప్రజారోగ్యాన్ని బాగు చేసే సిబ్బంది నియామకం కన్నా ప్రభుత్వానికి జన్మభూమి కమిటీలు, పుష్కరాలు వంటివి ముఖ్యంగా మారాయన్నారు. ప్రజలకు వైద్య ఆరోగ్యసేవలు లోక్‌సత్తాకు చాలా ప్రాధాన్యాంశమని, సరిగా అందించకుంటే వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఎ. నాగభూషణం, ఎం. చిన్నారావు, టి. రాజారావు, పి. చంద్రరావు, పెంటబాబు, శిమ్మశ్రీను, అప్పారావు, పి.ఎల్.ఎన్ రాజు, భాస్కర్, ఎర్నిబాబు తదితరులు పాల్గొన్నారు ✧

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

★ ఒక ప్రభుత్వం ఉండవచ్చు, లేదా పోవచ్చు. కానీ, జనంలో ఒక అమానుష ప్రవృత్తిని పోషించి వదిలితే, తిరిగి చట్టబద్ధపాలనను, మానవీయతను సాధించడం ఎంత కష్టం? రాజ్యాంగాన్ని పరిహసిస్తూ సెల్‌ఫోన్లు, టీవీ కెమెరాల ముందు ఒక మూక చేసే హత్యాకాండ, దాన్ని తప్పుపట్టకుండా సన్నాయినొక్కులతో సమర్థించాలని చూసే నాయకశ్రేణి, నిత్యకృత్యమైనా కూడా ఇంకా నిర్లిప్తతలోనే కూరుకుపోయి ఉన్న పౌరులు– ఈ దేశం ఎక్కడికి పోతోంది?

– కె.శ్రీనివాస్, సీనియర్ సంపాదకులు

★ అనేక భాషల సమ్మిళితంగా ఉన్న సమాజాలు తక్కువ హింసాత్మకంగా ఉంటే.. ఒకే భాషాధిపత్యం కలిగిన ప్రాంతాలు, సమూహాల్లో హింసాత్మక ధోరణులు ఎక్కువగా కనబడుతున్నాయి. మాతృభాషలో విద్య.. అభివృద్ధికి దోహదపడుతుంది. ప్రస్తుతం దేశంలో అన్నిచోట్లా చదువుల్లో ప్రమాణాలు పడిపోయాయి. 5వ తరగతి విద్యార్థులు రెండో తరగతి పుస్తకాలు సరిగా చదవలేకపోతున్నారు. ఇది జాతీయ విపత్తు. దీంతోపాటు ఇంగ్లీషు చదువూ అవసరమే. ఎందుకంటే అది విజ్ఞానానికి సంబంధించిన భాష. చిన్న భాషలు బతికున్న చోట అక్కడున్న జీవనోపాధి విధానాలను సంరక్షించాల్సిన అవసరం ఉంది. ఈ భాషలకూ, సంస్కృతికీ వలసలు ప్రధాన శత్రువులవుతున్నాయి. ఇదే సమయంలో వలసలు ఆధునికతకు కూడా కారణం అవుతున్నాయి. వలసల అవసరం పెద్దగా లేకుండా ఆధునికత సాధించేలా ఉండాలి. దీనికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. ప్రస్తుతం విచ్చలవిడిగా వాడుతున్న మొబైల్స్ మూకదాడులకే దోహదపడుతున్నాయి. ఈ పరిస్థితిలో పూర్తిగా మార్పు తేవాల్సిన అవసరం ఉంది.

- ప్రొఫెసర్ గణేష్ డెవి, పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా సారథి

★ చిన్నాచితకా విజయాలకే పొంగిపోయే ప్రభుత్వం విజ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టయిన నవకల్పనలను అశ్రద్ధ చేయడం భవిష్యత్తుకు మంచిది కాదు. నాయకులకు మేధా సామర్థ్యం ఉన్నప్పుడు సమాజంలోనూ మేధస్సు, సృజనాత్మకతలు వెల్లివిరుస్తాయి. మనకు సరిగ్గా అదే లోపించింది. దేశ జనాభాలో అత్యధికులు యువతీయువకులేనని పదేపదే చెప్పుకొంటున్నాం. వారిలోని సృజనాత్మకతను ప్రోత్సహించే వాతావరణం కొరవడటంతో వారి శక్తియుక్తులను సద్వినియోగం చేసుకోలేకపోతున్నాం. ఫలితంగా యువజనాధిక్యత వల్ల సిద్ధిస్తుందనుకొంటున్న ప్రయోజనం అందకుండా పోయే ప్రమాదం కనిపిస్తోంది. ఒకప్పుడు బ్రిటన్‌కు ఆర్థిక వలసరాజ్యంగా మారిన భారత్, రేపు విజ్ఞానపరంగానూ వలసరాజ్యంగా మారనుంది. ఆర్థిక కలాపాలకు విజ్ఞానాన్ని వినియోగించడటంలో భారత్ 66వ ర్యాంకు పొందగా– పేద దేశాలైన నైగర్ 18, నేపాల్ 64, కోస్టారికా 39వ ర్యాంకులు పొందాయి. భారత్ మాదిరిగా కాకుండా తమ పిల్లలకు నాణ్యమైన చదువు చెప్పించడం ఎంతో ముఖ్యమని ఈ దేశాలు గ్రహించడం వల్లనే అవి మనకన్నా ముందుకెళుతున్నాయి. భారతీయ విద్యావ్యవస్థ సృజనాత్మకతకు కాకుండా మార్కులకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల నవకల్పనల్లో వెనకబడిపోతోంది. ఇప్పుడు పరిస్థితి ఎంత వేగంగా మారిపోతోందంటే ఉన్న స్థానాన్ని నిలబెట్టుకోవడానికే మరింత శ్రమపడాల్సి వస్తోంది. క్రీ.శ 1000 సంవత్సరానికి ముందు విజ్ఞానరంగంలో దేశం ముందుండేది. ఆ తరువాత విద్యను, విజ్ఞానాన్ని అలక్ష్యం చేసి నానాటికీ తీసికట్టుగా తయారయ్యాం. విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానంతో మనకన్నా ముందున్న చిన్న దేశాల చేతిలో భారత్ ఓడిపోవాల్సి వచ్చింది. అయినా సరే– మన నాయకత్వం గుణపాఠం నేర్చుకోవడం లేదు. గత పొరపాట్లను సరిదిద్దుకోవడానికి ప్రయత్నించడం లేదు. నిర్లక్ష్య వైఖరి వల్ల ఆన్‌లైన్ సృజనాత్మకతలోనూ తీసికట్టుగా తయారవుతున్నాం. ఈ అంశంలో 2017లో 107వ ర్యాంకులో ఉన్న భారత్ 2018లో 67వ స్థానానికి పడిపోయింది. మిగతా దేశాలు విద్య, విజ్ఞానాలపై ఎక్కువ నిధులు కేటాయిస్తూ కొత్త ఆలోచనలను ప్రోత్సహిస్తుంటే, భారతదేశంలో భిన్నంగా ఆలోచించేవాళ్ల మీద దాడులు పెరిగిపోతున్నాయి. ఇటీవలి

కాలంలో అంకురా (స్టార్టప్)ల జోరు ఎక్కువైనట్టు కనిపించినా లోతుగా చూస్తే మరోకోణం కనపడుతుంది. కొన్ని అంకురాలు ఇంకా లాభాల్లోకి రాకపోయినా వాటికి వందల కోట్ల డాలర్ల విలువను ఆపాదించటం చూస్తున్నాం. ఇక్కడి అంకుర సంస్థల్లో అనేకం విదేశాల్లో వచ్చిన భావనలను, సంస్థలను అనుకరిస్తున్నాయి. గూగుల్, ఆపిల్, అమెజాన్ సంస్థల్లా ప్రపంచమంతటా విజయకేతనం ఎగురవేస్తున్న విజ్ఞాన కంపెనీలు భారత్‌లో కనీసం ఒక్కటైనా ఆవిర్భవించలేదు. చైనా, స్వీడన్, ఎస్తోనియా, దక్షిణ కొరియా మాదిరిగా పట్టుదలగా నవ్య ఆలోచనా ధోరణులను, నవకల్పనలను ప్రోత్సహిస్తే తప్ప ఈ విజ్ఞానయుగంలో నెట్టుకురాలేం.

– డాక్టర్ ఎస్. అనంత్

★ *నాడు స్వరాజ్యం జన్మహక్కుగా కదిలారు. నేడు సురాజ్యం మన ప్రాథమిక హక్కుగా నినదించాలి.*

*- ఎం. వెంకయ్య నాయుడు, భారత ఉప రాష్ట్రపతి*

★ *బంగ్లాదేశ్‌లోని రోహింగ్యా శరణార్థ శిబిరాలలో ఆరు నెలలుగా సాగుతున్న హత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. పది లక్షల మంది శరణార్థులు ఉండే చోట పోలీసులు 3వేల మంది కూడా లేరు. ఆధిపత్య పోరే హత్యలకు దారితీసిందని పోలీసులు అంటున్నప్పటికీ, ఏ పనీ లేకుండా సహాయనిధి మీదే బతకడం కూడా గొడవలకు కారణం.*

*– ది డైలీ స్టార్*

★ *ప్రజల జేబులో నుంచి ఖర్చు లేకుండా అందరికీ అందుబాటులో నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే జాతీయ ఆరోగ్య స్కీమ్ (ఎన్‌హెచ్ఎస్)లో ఎన్ని సమస్యలున్నా.. ఆ పథకానికి బ్రిటన్ ప్రజలు గట్టి మద్దతు తెలుపుతున్నారు. ఎన్‌హెచ్ఎస్‌కు నిధులు పెంచాలని చేసిన ఓ ప్రదర్శనను అడ్డంపెట్టుకోవటం ద్వారా.. ఎన్‌హెచ్ఎస్ విఫలమైందని చిత్రీకరించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నాన్ని అందుకే బ్రిటన్లు అంత తీవ్రంగా నిరసించారు. జాతీయత, ప్రభుత్వపాత్ర తదితర అంశాలపై ఇటీవల చేసిన ఓ ప్రజాభిప్రాయ సర్వేలో కూడా ఎన్‌హెచ్ఎస్‌కు మరిన్ని నిధులివ్వాలని అత్యధికులు కోరారు. 'లొసుగులెన్ని వున్నా ఎన్‌హెచ్ఎస్ ఓ ప్రత్యేక విధానం, వైద్య సేవల్ని ఉచితంగా పొందటం ప్రాథమిక మానవ హక్కు. దీన్ని అందించేందుకు నిజమైన ప్రయత్నం చేసిన దేశం ప్రపంచంలో బ్రిటన్ మాత్రమే' అని డాక్టర్ చంద్ చెబుతారు.*

*- విద్యా రామ్, సీనియర్ జర్నలిస్టు*

★ *సామాజిక, ఆర్థిక ప్రగతికి మన దేశంలో ఎన్నో విధానాలను అవలంబిస్తున్నా, అందులోని లోపాల వల్ల అనుకున్న లక్ష్యాలు నెరవేరడం లేదు. పిల్లల మానసిక పరివర్తన, వారి భవిష్యత్తుకు మార్గదర్శనం చేసే విధానాలు అమలుకావడం లేదు. అమెరికాలో ఉన్న పద్ధతుల్ని ఇక్కడ అమలు చేస్తే భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపయోగపడుతుందనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అలాగే అమెరికాలో ప్రజాధనం దుర్వినియోగం అయితే ఊరుకోరు. ఎదురు మాట్లాడితే.. 'ట్యాక్స్‌పేయర్స్ మనీ' అంటారు. ఆ ధోరణి ఇక్కడా రావాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ధనం అంటే ప్రజాధనం అనే స్పృహ మనలో బాగా పెరగాలి.*

*– అమెరికా ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఐవీఎల్‌పీ కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక కార్యకర్త సురేష్*

★ దోపిడీదారులు రాజకీయాల్లో కోట్లు సంపాదిస్తుంటే.. పీజీ, పీహెచ్‌డీలు చేసిన విద్యావంతులు వాళ్ల కింద పనిచేస్తున్నారు. ఇలాంటి వ్యవస్థ మారాలి.

**– పవన్ కళ్యాణ్, సినీ హీరో, జనసేన వ్యవస్థాపకుడు**

*(కర్టెసీ: ఈనాడు, ఆంధ్రజ్యోతి, ది హిందూ, సోషల్ మీడియా)* ✧



# సురాజ్య ఎజెండాను అమలు చేస్తే ఉపాధి, అభివృద్ధి వాటంతటవే వస్తాయి

ప్రభుత్వాలు మన డబ్బును రోజుకు ఎంత ఖర్చు చేస్తున్నాయి, ఏ రకంగా ఖర్చు చేస్తున్నాయి తెలుసుకోకపోతే ఇక పౌరసత్వానికి, దేశభక్తికి అర్థం లేదని జేపీ అన్నారు.

కర్నూలు సురాజ్య యాత్రలో భాగంగా స్థానిక బి.క్యాంప్ సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో జేపీ ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశభక్తి అంటే తల్లి భారతి కాదని, జాతీయజెండా కాదని, మహాత్మాగాంధీలాగా కొల్లాయి కట్టటం కాదని, జాతీయోద్యమ నేతల విగ్రహాలకు దండలేయటం కాదని.. ప్రజలందరికీ ఎదిగే అవకాశాల కోసం కృషి చేయటమని అన్నారు. దేశమంటే మట్టికాదు దేశమంటే మనుషులని గురజాడ ఎప్పుడో చెప్పారని, ఆ పద్యాన్ని బట్టీపడితే సరిపోదని, అందులోని అర్థాన్ని మనందరం తెలుసుకుని ఆచరించాలని అన్నారు. ఇతర ప్రజల కోసం ఆలోచించటమంటే మనం త్యాగం చేస్తున్నామనుకో నక్కర్లేదని, మన స్వార్థంలో భాగంగానే చుట్టూ ఉన్న సమాజాన్నీ పట్టించుకోవాలని అన్నారు. ఇలా సమాజంతో ముడిపడి వున్న ఉమ్మడి అవసరాలను సక్రమంగా నెరవేర్చుకుంటేనే మన వ్యక్తిగత అభివృద్ధి కూడా సాధ్యమవుతుందన్నారు. ఇందుకోసమే సురాజ్య యాత్ర అన్నారు.

**నంద్యాల ఎన్నికల్లో ఖర్చు చేసిన రూ.200 కోట్లు ఎక్కడివి?**

నంద్యాల ఉప ఎన్నికలో ఎంత ఖర్చు చేసి ఉంటారు? అని విద్యార్థులను జేపీ ప్రశ్నించారు. రూ. 300కోట్లు దాకా పార్టీలు ఖర్చు చేశాయని సమాధానం వచ్చింది. ఈ డబ్బంతా ఎక్కడ నుంచి వచ్చింది, తిరిగి ఆ డబ్బును మన నుంచే ఎలా సంపాదిస్తారు వంటి ప్రశ్నలను ఇంగితజ్ఞానంతో ఆలోచించాలని జేపీ అన్నారు. మనకు సంబంధించిన విషయం కాదు అనుకుంటే.. ఎప్పటికీ నష్టపోతూనే ఉంటామన్నారు.

ఏ పనులైతే ప్రభుత్వం చేయాలో, సక్రమంగా చేయాలో, ఏ పనుల్ని చేస్తే రాష్ట్రం, దేశం బాగుపడుతూ మనందరికీ వ్యక్తిగతంగా మేలు జరుగుతుందో.. ఆ పనుల్నే లక్ష్యాలుగా సురాజ్య యాత్రను రూపొందించామని జేపీ తెలిపారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదైతే వివరాలు ఇంకా స్పష్టంగా తెలుసుకోవచ్చుని, భాగస్వాములు కావచ్చుని అన్నారు.

ప్రభుత్వం చట్టబద్ధపాలన, మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, లంచాల్లేని సేవల్ని అందిస్తే ఉపాధి, అభివృద్ధి వాటంతటవే వచ్చేస్తాయని, కానీ అవి అందించకుండా

**ఉపాధి హామీ నిధుల్ని సద్వినియోగం చేసుకుంటే రాయలసీమలో ప్రతి నీటిబట్టునూ నిల్వచేసుకోవచ్చు**

సీమలో వర్షాలు తక్కువని బాధపడుతుంటారని, కానీ ఇటీవల భారీ వర్షాలు కరిస్తే రోడ్లు, వాగులు పొంగిపొర్లి ప్రజలు నానాకష్టాలు పడ్డారని జేపీ అన్నారు. ఉపాధి హామీ నిధులనే ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టుకునేందుకు, ఎకరాకు ఇంతని సద్వినియోగం చేస్తే సాగురంగం బాగుపడుతుందన్నారు. ఇప్పుడు ప్రాథమ్యాలను కొంత మార్చామని పాలకులు చెబుతున్నా, అవినీతి విచ్చలవిడి కావటం వల్ల ఫలితాలు మాత్రం మెరుగవలేదన్నారు.

సంక్షేమం పేరుతో అసంబద్ధ, తాత్కాలిక తాయిలాలనే గొప్ప పాలనగా ప్రచారం చేసుకుంటూ ప్రజల్ని మోసం చేస్తున్నారని జేపీ అన్నారు. దీనివల్లే దేశం ఎన్ని దశాబ్దాలు గడుస్తున్నా, యువత పెద్దసంఖ్యలో ఉన్నా కూడా ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగానే కొనసాగుతోందన్నారు. సంక్షేమ పథకాలలో కూడా చిత్తశుద్ధి లేదని, అందువల్లే అవినీతిమయంగా మారాయని అన్నారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం పేరుతో రూ.18,000కోట్లు ఖర్చు చేశారని, కానీ చివరికి అది గోతులు తవ్వటం, పూడ్చటం కార్యక్రమంగా మారిందితప్ప ప్రజలకు దీర్ఘకాలిక భరోసానిచ్చే కార్యక్రమంగా రూపుదిద్దుకోలేదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఉత్పాదకత కోసం వినియోగించుకోవాలని అసెంబ్లీలో, బైట పలుమార్లు తాను చెప్పినా పట్టించుకోలేదన్నారు. మరే దేశంలోనూ ప్రజాధనం పట్ల ఇంత నిర్లక్ష్యం కనిపించదన్నారు. గొప్ప సంస్కృతీవారసత్వ సంపదలున్న భారతదేశంలోనే ఇంత అధ్వాన్న పాలన కొనసాగుతోందన్నారు.

రాయలసీమలో తాగడానికి నీరులేదగానీ దోమలు పుష్కలంగా ఉన్నాయని జేపీ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి మీదా ఏడాదికి రూ.60,000 ఖర్చు చేస్తున్నా.. 8వ తరగతి చదువుతున్నవారిలో పలువురికి 1/3, 1/4లో ఏది ఎక్కువ అంటే తెలియని పరిస్థితి నెలకొందన్నారు. రైతులు పంటలను ఎక్కువగా ఉత్పత్తి చేసి, డిమాండ్ ఉన్నప్పుడు కూడా రేటు రాకుండా ప్రభుత్వాలే అడ్డుకుంటూ వారి రెక్కల కష్టానికి గండికొడుతున్నాయన్నారు. కలం పోటుతో రైతుకు ధర వచ్చే అవకాశాలకు పాలకులు గండి కొడుతున్నారన్నారు. మార్కెట్‌లో

**సహ చట్టం ఇంకా ఆశించిన ప్రయోజనాలను సాధించలేదు**

సమాచార హక్కు చట్టాన్ని ఇతర మిత్రులతో కలిసి లోక్‌సత్తా సాధించిందని, అయితే ఈ చట్టంపై ప్రజల్లో తగినంత చైతన్యాన్ని కల్పించటంలో ప్రభుత్వం విఫలమవటంతో ఆశించిన ఫలితాలు ఇంకా రాలేదని జేపీ అన్నారు. సమాజంలోని స్తబ్దతను అవకాశంగా తీసుకుని చట్టాన్ని నీరుగార్చేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్ణీత గడువులోగా పనులు జరిగేలా చేయటం, ఆ గడువులోగా చేయకపోతే రోజుకు ఇంతని డబ్బును ప్రభుత్వమే పరిహారం చెల్లించటం వంటి ఏర్పాట్లతో లోక్‌సత్తా రూపొందించిన 'పౌర సేవల' చట్టం సహ చట్టం కంటే కూడా విప్లవాత్మకమైనదని జేపీ అన్నారు.

*రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం పేరుతో రూ.18,000కోట్లు ఖర్చు చేశారని, కానీ చివరికి అది గోతులు తవ్వటం, పూడ్చటం కార్యక్రమంగా మారిందితప్ప ప్రజలకు దీర్ఘకాలిక భరోసానిచ్చే కార్యక్రమంగా రూపు దిద్దుకోలేదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఉత్పాదకత కోసం వినియోగించుకోవాలని అసెంబ్లీలో, బైట పలుమార్లు తాను చెప్పినా పట్టించుకోలేదన్నారు. మరే దేశంలోనూ ప్రజాధనం పట్ల ఇంత నిర్లక్ష్యం కనిపించదన్నారు. గొప్ప సంస్కృతీవారసత్వ సంపదలున్న భారతదేశంలోనే ఇంత అధ్వాన్న పాలన కొనసాగుతోందన్నారు.*

ఎప్పుడు ఏ రేటు ఉంటుందో ఎవరికీ తెలియదని, వినియోగదారులకు మాత్రం ధరలు తగ్గవని అన్నారు. రైతుల్ని, వినియోగదారుల్ని ఏకకాలంలో మోసం చేస్తున్న దళారీ వ్యవస్థను ప్రభుత్వాలే పెంచి పోషిస్తున్నాయన్నారు. మహిళల భద్రత గురించి భయపడనివారు మనలో ఎవరూ కనిపించరని, చట్టం డబ్బున్నవారికే అనుకూలంగా పనిచేస్తుందనేది పలు సందర్భాల్లో చూస్తున్నామని అన్నారు.

అధ్యాపకులు చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, జగన్, విజయకుమార్, లోక్‌సత్తా నేతలు రాజ్యలక్ష్మి, నాగరాజు, బలరాం, నారాయణ, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ✧



# జవాబుదారీతనంతో జనం చేతికి అధికారమివ్వండి

యువ ఐఏఎస్ అధికారులు ఇటీవల ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీని ఇటీవల హైదరాబాద్‌లోని ఎఫ్‌డీఆర్ కార్యాలయంలో కలిశారు. సవాళ్లను మెరుగ్గా ఎదుర్కోవడానికి తక్షణం దృష్టి సారించాల్సిన అంశాల పై చర్చించారు. ప్రాధాన్యాంశాల చుట్టూ ప్రజలకు స్థానికంగా అధికారాల్ని, బాధ్యతల్ని అప్పజెప్పి జవాబుదారీతనంతో వారి భాగస్వామ్యాన్ని పెంచితే... అద్భుత ఫలితాలు సుసాధ్యమవుతాయని జేపీ సూచించారు.

Posting Date 22-08-2018

RNI.Reg. No. APTEL/2010/32219 | Postal Reg. No. HD/1126/2016-18 | Published on August 16th, 2018




# ప్రతి ఒక్కరి,
# ప్రతి ఇంటీ పుస్తకం

## తప్పక చదవండి,
## చదివించండి

**పేజీలు : 64**

**వెల: రూ. 20/-**

**Book-Post**

PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad